ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
మంగళవారం 11 నవంబరు 2025



ప్రత్యేక అలంకరణలో ఖాజీపేట నాగనాథేశ్వరుడు

శివోహం..!

- భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు
- కిక్కిరిసిన నాగనాథేశ్వరుని కోన



అలంకారంలో మృత్యుంజయేశ్వరస్వామి

కడప/ఖాజీపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడో సోమవారం సందర్భాన్ని పురష్కరించుకుని జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆలయాలకు చేరుకోవడంతో శివనామ స్మరణతో ఆలయాలు మారుమోగాయి. ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించి కరుణించవా... కైలాసవాస అంటూ భక్తులు శరణుకోరారు. ఆవు నేయితో కార్తీకదీపాలను వెలిగించడంతో ఆలయాలు శోభాయమానంగా ప్రకాశించాయి. ఖాజీపేట మండలంలోని నాగనాథేశ్వరకోనలో భక్తులు కిక్కిరిశారు. దాదాపు 50 వేల మందికి పైగా దర్శించుకుని ఉంటారని ఆలయ కమిటీ చైర్మన్ సుమంత్‌రెడ్డి తెలిపారు. కాగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కమిటీ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కొండకింది భాగంలో ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించగా గెలుపొందిన వృషభరాజములకు నగదు బహుమతి అందించారు. ప్రొద్దుటూరు రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం లోనూ సైకతలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కార్తీకదీపాలు వెలిగించారు.

కడప నగరంలో...

నగర మృత్యుంజయకుంటలో వెలసిన మృత్యుంజయేశ్వరస్వామి ఆలయం, మోచంపేట ప్రసన్న విశ్వేశ్వరాలయం, గడ్డిబజార్‌లోని సోమేశ్వరాలయంలో కార్తీక పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై హర హర మహాదేవ.. శంభో శంకర అంటూ స్వామివారిని వేడుకున్నారు. వేకువజామునే అభిషేకాలు గావించారు. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించడంతో నూతన శోభను సంతరించుకుంది.



నాగనాథేశ్వరకోనలో క్యూలైన్‌లో వేచి వున్న భక్తులు



మృత్యుంజయకుంట శివాలయంలో స్వామివారి దర్శనం కోసం క్యూలో వున్న భక్తులు



రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ప్రజా సమస్యలను అలక్ష్యం చేస్తే చర్యలు

- జాయింట్ కలెక్టర్ అదితిసింగ్



అర్జీలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యల పరిష్కారం కోసం జిల్లా మండల, కేంద్రాల్లో అర్జీలు సమర్పించే బాధితుల సమస్యలను అలక్ష్యం చేసే అధికారులపై చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ హెచ్చరిం చారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో ప్రజా సమస్యల పరి ష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. జిల్లా వ్యాప్తంగా అర్జీ దారులు పెద్ద ఎత్తున పాల్గొని తమ సమస్యలతో కూడిన వినతిపత్రాల ను జాయింట్ కలెక్టర్, అధికారులకు అందజేసి తమ సమస్యలు విన్నవిం చుకున్నారు. వారి అర్జీలను పరిశీలిస్తూ తదుపరి చర్యలకై సంబంధిత అధికారులకు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి విచారణ చేపట్టాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందే లా పారదర్శకంగా నాణ్యమైన పరిష్కారం అందించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఖాజీపేట మండలం, మూలవారిపల్లికి చెందిన లింగయ్య ఫిర్యాదు చేస్తూ.. పక్షవాతం వలన కాలు చేయి పనిచేయడం లేదని, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నానని ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందివ్వాల న్నారు. పెద్ద ముడియం మండలం నెమళ్లదిన్నెకు చెందిన సోమన్న తన కు 1.52 ఎకరాల పొలం ఉందని, సర్వే చేయించి ఆన్‌లైన్ ఎక్కించాలన్నా రు. ఇలాంటి అనేక అర్జీలను పరిశీలిస్తూ సంబంధిత అధికారులు వెంట నే పరిష్కరించాలని జేసీ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు జడ్పీ సీఈవో ఓబులమ్మ, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- ఎస్పీ నచికేత్ విశ్వనాథ్



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ నచికేత్

కడప క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మొత్తం 179 ఫిర్యాదులు పీజీఆర్ఎస్‌కు వచ్చాయి. ఈ సందర్భంగా ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులతో ప్రత్యక్షంగా ఫోనులో మాట్లాడారు. బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు తమ వినతులను విన్నవిం చారు. వాటిపై సంబంధిత పోలీసు అధికారలుతో ఎస్పీ నేరుగా మాట్లాడి సమస్యను చట్టపరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో ఎస్పీతో పాటు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎస్.సుధాకర్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ మధుమల్లేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లాలో హైఅలర్ట్

- విస్తృతంగా పోలీసుల తనిఖీలు



కడప రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న ఎస్ఐ అమరనాథరెడ్డి

కడప క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట వద్ద కారులో పేలుడు జరిగిన నేపథ్యంలో జిల్లాలో పోలీసులు హైఅలర్ట్ అయ్యారు. ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేశారు. వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డి ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్‌ను, చిన్నచౌక్ సీఐ ఓబులేసు ఆధ్వర్యంలో ఎస్ఐలు రాజరాజేశ్వరరెడ్డి, రవికుమార్ సిబ్బందితో కలిసి ఆర్టీసీ బస్టాండ్‌లో బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు చేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా పోలీసులు తనిఖీ చేపట్టారు.

జిల్లాలో భారీ పరిశ్రమ ఏర్పాటు

- వేలాది మందికి ఉపాధి

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా గోపవరం మండలంలో నూతన పరిశ్రమ రూపుదిద్దుకోనుంది. ప్రముఖ కంపెనీ సెంచరీ ప్యానెల్స్ ప్లైవుడ్, బ్లాక్ బోర్డ్, ఎండీఎఫ్, పార్టికల్ బోర్డు యూనిట్ స్థాపనకు రూ.956 కోట్ల పెట్టుబడి ప్రాతిపాదించింది. ఈ యూనిట్‌కు 1200 క్యూబిక్ మీటర్ల ఉత్పత్తి సామర్థ్యం ఉండనుంది. ఈ మేరకు పరిశ్రమల శాఖ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 2266 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. ప్లైవుడ్, ఎండీఎఫ్ రంగంలో ఇది రాష్ట్రంలోనే అతిపెద్ద పెట్టుబడుల్లో ఒకటని, ఈ ప్రాజెక్టు అమలు ద్వారా స్థానిక యువతకు విస్తృతమైన ఉపాధి అవకాశాలు వుంటాయని అధికారులు తెలిపారు.

కడపలో బ్రౌన్ నివసించడం గర్వకారణం

- డీఆర్ఓ విశ్వేశ్వరనాయుడు



సీపీబ్రౌన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్ఓ, తదితరులు

కడపకల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలుగు సూర్యుడు సీపీబ్రౌన్ కడపలో నివాసం వుండడం జిల్లా వాసులందరికీ గర్వ కారణమని డీఆర్ఓ విశ్వేశ్వరనాయుడు అన్నారు. సీపీబ్రౌన్ జయంతిని పురష్కరించుకుని సోమవారం స్థానిక ఆఫీసర్స్ క్లబ్‌లో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళిఅర్పించారు. అలాగే కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సీపీబ్రౌన్ జయంతి వేడుకలు నిర్వహించారు. తెలుగు భాషా ప్రియులకు సీపీబ్రౌన్ చేసిన సేవలు మరువలేనివని డీఆర్వో అన్నారు. కార్యక్రమంలో జానమద్ది విజయభాస్కర్, ఆఫీసర్స్ క్లబ్ సభ్యులు వీరభద్రయ్య, ఎల్.మధుసూధన్‌రెడ్డి, సుబ్బరామయ్య, కేశవులు, రెగ్గిన్ ప్రభు, సుబ్బరాయుడు, రవీంద్రతో పాటు పలువురు అధికారులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

కడప క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషోద్ధరణకు విశేష కృషి చేసిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (సీపీ బ్రౌన్) జయంతి వేడుకలను జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ (ఏఆర్) రమణయ్య సీపీ బ్రౌన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను స్మరిస్తూ ప్రసంగించారు. కార్యక్రమంలో డీపీవో ఏవో వెంకటరమణ, ఆర్ఐలు శివరాముడు, శ్రీశైలరెడ్డి, టైటస్, సోమశేఖరనాయక్, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మాతృభాష గురించి యువత తెలుసుకోవాలి

- సినీనటుడు సుమన్



ఆలయాన్ని పరిశీలిస్తున్న సుమన్

ఎర్రగుంట్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మాతృభాష (తెలుగు) ఎక్కడి నుంచి వచ్చిందో యువత తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సినీనటుడు సుమన్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం ఆయన ఎర్రగుంట్ల మండలం కలమల్లలోని తొలి తెలుగు శాసనాలను సందర్శించారు. సిద్ధేశ్వరస్వామి, చెన్నకేశవస్వామి ఆలయాలకు వెళ్లి ఆ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ తొలి తెలుగు శాసనాలున్న ఈ ప్రాంగణాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ విషయం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అందుకు గ్రామస్థులు కూడా ప్రత్యేక కృషి చేయాలని కోరారు. భాషకు సంబంధించిన విషయం అయినందున స్థానిక గొడవలను పక్కనబెట్టి అందరూ కలిసికట్టుగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తొలి తెలుగు దివ్వె తెలుగు మూలల అధ్యయన సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పిల్లి లక్ష్మితులసి, సంఘం వ్యవస్థాపకుడు వీవీఎల్ఎన్ రాజు, గ్రామస్థులు సాంబ శివారెడ్డిలు మాట్లాడుతూ 5వ తరగతిలో 'చదువుదాం కలమల్ల శాసనాలు' పేరుతో పాఠ్యాంశంగా పెట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా మమ్మీ, డాడీ సంస్కృతి పోయి అమ్మ, నాన్న సంస్కృతి రావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సుమన్‌ను గ్రామస్థులు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నారాయణ, వెంకటేష్, చిన్నన్న, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

అజ్మీర్‌కు ప్రత్యేక వీక్లీ రైలు

కడప ఎర్రముక్కపల్లె, నవం బరు 10 (ఆంధ్రజ్యోతి): కోయం బత్తూర్-మగర్-కడప మీదుగా ప్రత్యేక వీక్లీ రైలును (06181 /06182)ను నడప నున్నట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎ.జనా ర్దన్ తెలిపారు. కోయంబత్తూర్‌లో ప్రతి గురువారం (నవంబరు 13, 20, 27, డిసెంబరు 4) తేదీల్లో రాత్రి 2.30 గంటలకు రైలు బయలుదేరుతుందన్నారు. అదే రోజు మధ్యాహ్నం కడపకు 12.58, ఎర్రగుంట్ల 01.23 గంటలకు చేరుకుంటుందన్నారు. కాచిగూడ, నాందేడ్, సూరత్, వడోదర మీదుగా శనివారం ఉదయం అజ్మీర్‌కు 10.40కు, మగర్ 11.20 గంటలకు చేరుకుంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో మగర్ నుంచి ప్రతి ఆదివారం (నవంబరు 16, 23, 30, డిసెంబరు 7) తేదీల్లో రాత్రి 11.50 గంటలకు బయలుదేరి అజ్మీర్‌కు 12.15 గంటలకు చేరుకుంటుందన్నారు. వడోదర, సూరత్, నాందేడ్, కాచిగూడ మీదుగా ఎర్రగుంట్లకు మంగళవారం సాయంత్రం 05.23, కడప 06.05 గంటలకు చేరుకుని, బుధవారం ఉదయం 8.30 గంటలకు కోయంబత్తూర్ చేరుకుంటుందని తెలిపారు. అజ్మీర్ వెళ్లే ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ఇన్‌చార్జి మంత్రి రాక

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్.సవిత మంగళవారం జిల్లా పర్యటనకు రానున్నారు. ఉదయం 9.45 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకొని 10 నుంచి మధ్యాహ్నం 12.15 వరకు కడప జిల్లాలో కొత్త పరిశ్రమల వర్చువల్ ప్రారంభోత్సవం,శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబునాయుడు వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12.15 గంటలకు కడప నుంచి బయలుదేరి 2.15కు పుట్టపర్తికి చేరుకుంటారు.

మట్టిమిద్దె కూలి వృద్ధురాలి మృతి

- జువారి బ్లాస్టింగ్ వల్లేనంటూ గ్రామస్థుల ఆగ్రహం
- మృతదేహంతో ధర్నాకు యత్నం



మట్టిమిద్దె కూలి మృతిచెందిన వీరమ్మ



వీరమ్మ (ఫైల్‌ఫొటో)

ఎర్రగుంట్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మట్టిమిద్దె కూలి ఓ వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మండలంలోని వలసపల్లె దళితవాడలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళి తే... దళితవాడలో నివాసం వుండే నల్లబల్లె వీరమ్మ(60) గ్రామ పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తూ జీవనం సాగించేది. రోజులాగే ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రించింది. సోమవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో పెద్ద శబ్దం వచ్చి మట్టిమిద్దె పైకప్పు కూలి వీరమ్మపై పడింది. దీంతో ఆమెపై మట్టి కూరుకుపోయి ఊపిరి ఆడక అక్కడికక్కడే మృతిచెందింది. ఉదయం ఎంతకీ బయటకు రాకపోవడంతో కుమారుడు, కోడలు నిద్రలేపేందుకు తలుపు తట్టారు. తెరవకపోవడంతో పగలగొట్టి తెరచి చూడగా మిద్దె కూలి వీరమ్మపై పడటాన్ని గమనించారు. వెంటనే స్థానికుల ద్వారా ఆమె మృతదేహాన్ని వెలికితీశారు. ఆగ్రహంతో ఊగిపోయారు. మృతదేహంతో జువారి వద్ద ధర్నాకు దిగేందుకు యత్నించారు. పోలీసులకు సమాచారం అందడంతో సీఐ విశ్వనాథరెడ్డి, ఎస్ఐ నాగమురళిలు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామ కార్యదర్శి బ్రహ్మం పరిస్థితిని గమనించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. కాగా జువారీ బ్లాస్టింగ్ వల్ల ఇళ్లు అదురుతున్నాయని, గోడలు చీలిపోతున్నాయని, సామాన్లు కిందపడుతున్నాయని గ్రామస్థులు, కుటుంబ సభ్యులు సీఐకి ఫిర్యాదు చేశారు. వీరమ్మ మరణానికి కూడా జువారి బ్లాస్టింగే కారణమని వారు ఆరోపించారు. దీంతో సీఐ విశ్వనాథరెడ్డి.. సీఎస్ఓ నాగమల్లేశ్వరరావును పిలిపించి పరిస్థితిని వివరించగా, ఆయన జరిగిన విషయాన్ని జీఎం క్రిష్ణమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారులకు తెలియజేసి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు, మృతురాలి బంధువులు శాంతించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ విశ్వనాథరెడ్డి

బదిలీ.. బడికెప్పుడు..?

- పాత పాఠశాలల్లోనే కొనసాగింపు
- రిలీవ్ కోసం ఉపాధ్యాయుల ఎదురుచూపులు



కడప ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బదిలీ అయి నాలుగునెలలు గడిచినా పాత పాఠశాలల్లోనే ఉండిపోవాల్సిన పరిస్థితి ఉపాధ్యాయులను కలతపెడుతోంది. రాష్ట్ర విద్యాశాఖ గతంలో చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీలు కాగితం మీద పూర్తయినా.. వాస్తవ రూపం దాల్చలేదు. బదిలీ ఆర్డర్లు వచ్చినా కొత్త పాఠశాలల్లో చేరలేక పాత స్కూళ్లలోనే కొనసాగుతున్న ఉపాధ్యాయులు జిల్లాలో వందల మంది ఉన్నారు. దీనికి బదిలీ నిబంధనలే కారణం అని చెప్పాలి. బదిలీ అయిన ఉపాధ్యాయుల్లో 50శాతం మందిని మాత్రమే రిలీవ్ చేయాలని నిబంధన విధించారు. దీంతో ఏకోపాధ్యాయ పాఠశాలల్లో, ఎక్కువమంది బదిలీ అయిన ఉపాధ్యాయులున్న పాఠశాలల్లో సిబ్బంది కొరత ఏర్పడింది. ఫలితంగా రిలీవర్ లేక పాత స్కూళ్లలోనే వీరంతా పనిచేస్తున్నారు.

మెగా డీఎస్సీతో కొంత ఊరట

మెగా డీఎస్సీ-2025 ద్వారా కొత్త ఉపాధ్యాయుల నియామకాలతో పరిస్థితి కొంతమేర సద్దుమణిగింది. తెలుగు, ఉర్దూ మీడియం కలిపి 232 మంది ఉపాధ్యాయులు కొత్త పాఠశాలల్లో చేరగా, అందులో 209 మంది తెలుగు ఎస్జీటీలు ఉన్నారు. వీరిలో ఫస్ట్ రిలీవర్ ద్వారా 173 మంది, సెకండ్ రిలీవర్ ద్వారా 33 మంది, థర్డ్ రిలీవర్ ద్వారా ముగ్గురిని రిలీవ్ చేశారు. ఇంకా మిగిలి ఉన్న ఎస్జీటీ లు, స్కూల్ అసిస్టెంట్లు మాత్రం రిలీవ్ కాక పాత స్కూళ్లలోనే కొనసాగుతున్నారు.

బదిలీ అయినా ప్రయోజనం లేదు

నందలూరు మండలం పొత్తపి పాఠశాల నుంచి ఖాజీపేట మండలానికి ఓ ఉపాధ్యాయుడు బదిలీ అయ్యాడు. దాదాపు 70కిలోమీటర్ల దూరం తగ్గిందనుకున్నాడు. అయితే రిలీవర్ రాక పోవడంతో పాత స్కూల్లోనే ఉండి పోవాల్సి వచ్చింది అని ఉపాధ్యా యుడు బాధ వ్యక్తం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్నప్ప టికి, తనకు కేటాయించిన పాఠశాలలో చేరలేని పరిస్థితి ఉందని తెలిపారు. ఇక మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో తరగతికి ఒక టీచర్ అనే విధానం ఆచరణలో విఫలమవుతోంది. రిలీవర్ లేమితో సిబ్బంది కొరత ఏర్పడి బోధన నాణ్యత దెబ్బతింటోం ది. కాగా.. విద్యావలంటీర్ల నియామకం ద్వారా ఈ సమస్యను పరిష్కరించవచ్చని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు పేర్కొన్నారు. వీరు నియమితులైన వెంటనే బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేసే వీలుంటుందన్నారు. మరి రాష్ట్ర విద్యాశాఖ దీనిపై ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది.

ప్రతిపాదనలు పంపించాం



ఉపాధ్యాయుల సమస్యలు త్వరలో పరిష్కారం అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లాలో ఖాళీలకు సంబంధించి రాష్ట్ర విద్యాశాఖకు ప్రతిపాదనలు పంపించాం. దీనికి ఆమోదం లభించిన వెంటనే జిల్లాలో విద్యావలంటీర్ల ద్వారా ప్రతి ఖాళీని భర్తీ చేస్తాం.

- షంషుద్దీన్, డీఈవో

క్షత్రియులకు దానగుణం.. దయాగుణం

● రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సూర్యనారాయణరాజు



మాట్లాడుతున్న క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సూర్యనారాయణరాజు

రైల్వేకోడూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): దానగుణం, దయాగుణం కల్గిన వారు క్షత్రియులని, అందరూ ఐక్యంగా ఉండి పేదల తరఫున పోరాడాలని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సూర్యనారాయణరాజు అలియాస్ సూరి తెలిపారు. సోమవారం రైల్వేకోడూరులో ఏర్పాటు చేసిన క్షత్రియ గెట్ టుగెదర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షత్రియులు కలసికట్టుగా ఉంటే సాధించలేనిది ఏదీ ఉండదన్నారు. క్షత్రియులు దళిత, గిరిజన, పేద, బడుగు, బలహీన వర్గాల కోసం పోరాటాలు చేయాలన్నారు. క్షత్రియ పేద విద్యార్థుల చదువులు, ఉద్యోగాలకు ప్రయత్నించాలన్నారు. అన్నమయ్య, కడప జిల్లాల్లో ఉన్న క్షత్రియులు అందరూ వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నారని, ఫ్యాక్షన్ రాజకీయాలకు దూరంగా ఉండి హక్కులను సాధించుకునేందుకు పోరాటాలు చేయాలన్నారు. క్షత్రియులు ఏ పార్టీలో ఉన్నా క్షత్రియ సేవ ఆగిపోకూడదన్నారు. ప్రస్తుతం అన్ని కులాల వారు తమ ఉనికిని కాపాడుకునేందుకు హక్కులు కావాలని పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను కలసి క్షత్రియుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేసే విధంగా ప్రయత్నిస్తామని తెలిపారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అడ్డెపల్లి ప్రతాప్‌రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న క్షత్రియులు అందరూ పోరాట పటిమ కల్గిన వారే అని తెలిపారు. గ్రామాల్లో అన్ని కులాలను కలుపుకునిపోవాలన్నారు. కార్యక్రమంలో క్షత్రియ నాయకులు ముద్దలూరు చంద్రరాజు, ప్రముఖ లాయర్ అడ్డెపల్లె వెంకట్రామరాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంగరాజు రవికుమార్ రాజు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

రాజంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హస్తవరం చెర్లోపల్లె ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట సుబ్బయ్య, పీడీఎం ఈశ్వర్‌నాయక్ తెలిపారు. ఈ నెల 8న కడప మున్సిపల్ ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో హస్తవరం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. అండర్-14 ఖోఖో బాలికల క్రీడా విభాగంలో పి.దీక్షిత, పి.మానస, పి.మధుప్రియ, బాలుర విభాగంలో ఎ.హర్షవర్ధన్ ఎన్నికయ్యారని తెలిపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు అనకాపల్లె జిల్లాలో రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడాపోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. హస్తవరం, చెర్లోపల్లె ఉన్నత పాఠశాలకు వ్యాయామ ఉపాధ్యాయుడు ఈశ్వర్‌నాయక్ మూడు నెలల కిందటే నియమితులైనా తమ పాఠశాల విద్యార్థులను జిల్లాస్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి వెళ్లేలా తీర్చిదిద్దడంపై ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు

● రూ.40 లక్షల విలువ చేసే బంగారు నగలు స్వాధీనం



అంతర్‌రాష్ట్ర దొంగను అరెస్టు చూపుతున్న వన్‌టౌన్ సీఐ మహమ్మద్‌రఫీ

మదనపల్లె అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంతర్ రాష్ట్ర దొంగను అరెస్టు చేసి అతని నుంచి రూ.40లక్షల విలువ చేసే బంగారు నగలను స్వాధీనం చేసుకున్నట్లు మదనపల్లె వన్‌టౌన్ సీఐ పి.మహమ్మద్ రఫీ తెలిపారు. సోమవారం మదనపల్లె వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో మీడియా సమావేశంలో నిందితుడి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు వన్‌టౌన్ సీఐ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి జిల్లా తనకల్లు మండలం నందిగానిపల్లె గ్రామం కొక్కంటి క్రాస్‌కు చెందిన పసుపులేటి సూరిబాబు కుమారుడు పసుపులేటి సాయికుమార్(30) దొంగతనాలు చేస్తూ పోలీసులకు పట్టుబడ్డాడని, ఇందులో మదనపల్లె పట్టణంలో నీరుగట్టువారిపల్లె, రామిరెడ్డి లేవుట్, తదితర చోట్ల దొంగతనాలు చేసి బంగారు నగలు అపహరించాడు. విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం సాయంత్రం మదనపల్లె పట్టణం అమ్మచెరువు మిట్ట వద్ద ఆర్కే టైల్స్ సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పీజీఆర్ఎస్ సమస్యలను పరిష్కరించండి

● జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు



పీజీఎస్ఆర్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు

రాయచోటి(నేతాజీసర్కిల్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా రెవెన్యూ అధికారి అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ సంక్లిష్టమైన అర్జీలను అలాగే వదిలిపెట్టకుండా నిర్ణయాత్మకమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. గుర్రంకొండ మండలం రామిరెడ్డిగారిపల్లెకు చెందిన నాగభూషణమ్మ తనకు ఆర్టీసీ బస్సు ప్రమాదం వలన కాలు విరిగిందని, చక్రాల కుర్చీకే పరిమితమయ్యానని తనకు వికలాంగుల పెన్షన్ ఇప్పించాలని కోరారు. సుండుపల్లెకు చెందిన బొమ్మిరెడ్డి భాగ్యమ్మ తన భర్త మరణించాడని తనకు వితంతు పెన్షన్ ఇప్పించాలని కోరింది. బి.కొత్తకోటకు చెందిన కె.చైత్ర తాను కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని తన కుమారుడు కె.పునీత్ బి.కొత్తకోటలోని ప్రభుత్వ పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్నాడని తల్లికి వందనం డబ్బులు ఇంతవరకు జమకాలేదని విచారణ జరిపి తల్లికి వందనం డబ్బులు ఇప్పించాలని కోరింది. ఈ సమస్యలన్నీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఏడీ సర్వేయర్ భరత్‌కుమార్, జీఎస్ డబ్ల్యు ఎస్.లక్ష్మీపతి, డ్వామా పీడీ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

నాడు ఘనం.. నేడు దయనీయం...

● ఐపీఎస్‌ల పాఠశాలకు ఆదరణ కరువు

● శతాబ్ది ఉత్సవాలకు దూరం

● షిఫ్ట్ పద్ధతిలో పాఠశాల, కళాశాల తరగతులు

● కూలేందుకు సిద్ధంగా భవనాలు



నందలూరులోని సరస్వతి నిలయం

నందలూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆ పాఠశాల నిర్మించి వంద సంవత్సరాలు పైబడింది. ఎంతోమందికి ఉన్నతస్థాయి కల్పించిన ఆ పాఠశాల నేడు దయనీయ స్థితిలో ఉంది. నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పలువురు విద్యార్థుల అభివృద్ధికి బాటలు వేసింది. ఈ పాఠశాలలో చదివిన ప్రతిఒక్కరు ఉన్నత శిఖరాలు అధిరోహించారు. కొందరు ఐఏఎస్‌లుగా ఇంకొందరు ఐపీఎస్‌లుగా మరికొందరు వివిధ రకాల ఉన్నతాధికారులుగా, రాజకీయ నాయకులుగా, ఎమ్మెల్యేలుగా చరిత్ర పుటల్లోకి ఎక్కారు. అలాంటి పాఠశాల నేడు అనేక సంవత్సరాలుగా అభివృద్ధికి దూరమైంది. రాజంపేట నియోజకవర్గాన్ని నాటి నుంచి నేటి వరకు పాలించిన ఒకరిద్దరు శాసనసభ్యుల మినహాయించి మిగతా వారందరూ మండలవాసులు కావడం గమనార్హం. దీంతో పాటు పాఠశాల ఇప్పటికే నూతన సోకులతో కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా అభివృద్ధిలో అడుగు వేయాల్సి ఉంది. అయితే పాలకుల నిర్లక్ష్యమో, అధికారుల అలసత్వమో తెలియదు కానీ ప్రస్తుతం ఈ పాఠశాల లోపలకు వెళ్లేందుకు విద్యార్థులు భయపడుతున్నారు. కాలం చెల్లిన భవనాల మధ్య బిక్కు బిక్కుమంటూ చదువునెట్టుకొస్తున్నారు. 1908లో ఏర్పాటు చేసిన ఈ జిల్లా పరిషత్ పాఠశాల నేడు దయనీయ స్థితికి చేరుతోంది. 1968 మే 3వ తేదీ అప్పటి ఎమ్మెల్యే బండారు రత్నసభాపతి, అప్పటి కడప జిల్లా జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉన్న బలరామిరెడ్డి సమయంలో నిర్మించిన సైన్సు బ్లాక్ భవనాలు ఏ సమయంలో కూలుతాయోనని అటు విద్యార్థులతో పాటు ఇటు గ్రామస్థులు ఆందోళనకు గురవుతున్నారు. పరిపాలనా భవనం కూడా కాలం చెల్లింది. ఇప్పటికే స్లాబు పెచ్చులూడి పడుతుండడంతో ఉపాధ్యాయులు, సిబ్బంది నిత్యం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాలం నెట్టుకొస్తున్నారు. పాఠశాల దుస్థితిని గమనించిన పలువురు మండల నేతలు కాలం చెల్లిన భవనాలను చెల్లించి నూతన భవనాలను నిర్మించాలని పలుమార్లు జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు విన్నవించినా ఇప్పటివరకు అధికారులు స్పందించకపోవడం బాధాకరం. జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి కాలం చెల్లిన భవనాలను తొలగించి నూతన భవనాలను నిర్మించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యార్థులు కోరుతున్నారు. కొంతమంది పూర్వపు విద్యార్థులు పాఠశాలలో స్టేజ్ నిర్మాణాన్ని చేపట్టారు. మరికొందరు విద్యార్థుల అపూర్వ కలయికలో డెస్కులు, ఇతర సామగ్రిని అందజేశారు. పాఠశాల అభివృద్ధికి పూర్వపు విద్యార్థులకు ఉన్న ఆసక్తి సైతం అధికారులకు లేకపోవడం ఏమిటని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎప్పుడు కూలుతుందో తెలియని రెండో అంతస్తు భవనం

పాఠశాలలోనే కళాశాల తరగతులు

ఉన్న భవనాలు అంతంత మాత్రమే. మరి ఇలాంటి తరుణంలో జిల్లా పరిషత్ పాఠశాల భవనాల్లోనే జూనియర్ కళాశాల తరగతులను నిర్వహిస్తున్నారు. అనేక సంవత్సరాలుగా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో అటు పాఠశాల విద్యార్థులు, ఇటు కళాశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. గతంలో పాఠశాల తరగతులు ఉదయం, మధ్యాహ్నం నిర్వహించేవారు. కళాశాలకు సొంత భవనాలు లేకపోవడంతో పాఠశాలలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం పాఠశాల విద్యార్థులకు, మధ్యాహ్నం కళాశాల విద్యార్థులకు షిఫ్ట్ పద్ధతిలో తరగతులు నిర్వహించడంతో విద్యార్థులు పూర్తి స్థాయిలో ఇబ్బందులు పడుతున్నారు. వీరితో పాటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు కూడా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా నూతన భవన నిర్మాణాలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. కళాశాల నూతన భవనాల నిర్మాణం కోసం ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని స్థలాన్ని ఎంపిక చేసినప్పటికీ అది మరుగునపడిపోయింది. ఏది ఏమైనా టీడీపీ నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌చార్జ్ చమర్తి జగన్‌మోహన్‌రాజు నందలూరు పాఠశాల, కళాశాల అభివృద్ధిపై దృష్టి సారించాలని మండల వాసులు, విద్యార్థులు కోరుతున్నారు.

శతాబ్ది ఉత్సవాలకు నోచుకోకపోవడం శోచనీయం



ఉమ్మడి కడప జిల్లాలో ఐఏఎస్‌ల పాఠశాలగా ఖ్యాతి గడించిన నందలూరు జడ్పీ ఉన్నత పాఠశాలను ప్రారంభించి 115 ఏళ్లు పూర్తయినా నేటికి శతాబ్ది ఉత్సవాలకు నోచుకోకపోవడం శోచనీయం. ఐదుగురు ఐఏఎస్‌లు, రిజర్వు బ్యాంకు గవర్నర్, ఎంపీలు, ఎమ్మెల్యేలుగా ఎన్నికైన పూర్వ విద్యార్థులు ఎందరో. ఇంతటి ఘనకీర్తి కలిగిన పాఠశాలలో వసతులు లేమి పీడిస్తోంది. దీనిపై చొరవ చూపి పాఠశాల ఉత్సవాలు నిర్వహించాలి.

- డాక్టర్ రాంప్రసాద్, రాజంపేట బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్, నందలూరు

క్రీడామైదానం కేటాయించాలి



పాఠశాలకు కేటాయించిన క్రీడా మైదానం 2 కి.మీ. దూరంలో ఉండడం వల్ల విద్యార్థులకు నిరుపయోగంగా మారింది. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు కొరవడుతున్నాయి. తల్లిదండ్రులు, గ్రామ ప్రజల, విద్యార్థుల కోరిక మేరకు సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని కళాశాల నిర్వహణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.

- సమ్మెట శివప్రసాద్, మాజీ సర్పంచ్, నాగిరెడ్డిపల్లె

కన్నతల్లే హంతకురాలు

● బిడ్డను చంపించి.. అంత్యక్రియలకు హాజరు

● ఎంబీఏ విద్యార్థి జయప్రకాశ్‌రెడ్డి హత్య కేసును ఛేదించిన పోలీసులు

● తల్లితో పాటు ఏడుగురు అరెస్టు





నిందితులను చూపుతున్న సీఐ గోపాల్‌రెడ్డి, (ఇన్‌సెట్లో) హత్యకు గురైన జయప్రకాశ్‌రెడ్డి

బి.కొత్తకోట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కన్నతల్లే కాలాంతకురాలైంది... స్వార్థం ముందు పేగుబంధం చిన్నబోయింది... బిడ్డలే ఆస్తి, బిడ్డల సుఖం, బిడ్డలే సర్వస్వం అనే మాటలను పక్కన బెట్టి ఆస్తి ముఖ్యం.. సుఖమే ప్రధానం అన్నట్టు మాతృత్వానికే మచ్చ తెచ్చింది ఈ మహాతల్లి. కని, పెంచిన కనికరం మరిచి కసాయిగా మారింది. పెళ్లీడుకొచ్చిన కొడుకును పథకం ప్రకారం కడతేర్చి ఏమీ తెలియనట్లు అంత్యక్రియలకూ హాజరైంది. అందరూ అనుమానించినట్టే ముద్దాయిగా నిలిచింది.

బి.కొత్తకోట మండలం గోళ్లపల్లి పంచాయతీ పరిధిలోని గుడిసివారిపల్లెలో ఈ నెల 7న జరిగిన బీటెక్ విద్యార్థి తిరుమలయ్యగారి జయప్రకాశ్‌రెడ్డి హత్య కేసులో కన్నతల్లి శ్యామలమ్మ ప్రధాన నిందితురాలని, సుపారీ ఇచ్చి తన పెద్ద కొడుకును కడతేర్చినట్టు పోలీసులు బయటపెట్టారు. మాతృత్వం మంటకలిసిన ఈ ఉదంతం గురించి సోమవారం సీఐ గోపాల్‌రెడ్డి వివరాల మేరకు... గుడిసివారిపల్లికి చెందిన లేట్ తిరుమలయ్యగారి వెంకటశివారెడ్డికి భార్య శ్యామలమ్మ(41), కుమారులు జయప్రకాశ్‌రెడ్డి(24), గిరివర్ధన్‌రెడ్డి(21) ఉన్నారు. వారిలో జయప్రకాశ్‌రెడ్డి అంగళ్ల వద్దనున్న మిట్స్ కాలేజీలో ఎంబీఏ సెకండ్ ఇయర్ చదువుతుండగా, గిరివర్ధన్‌రెడ్డి గుంటూరులో సీఏ కోచింగ్‌లో వున్నాడు. తండ్రి నాలుగేళ్ల క్రితం చనిపోయాడు. అయితే నాలుగు నెలలుగా తల్లి శ్యామలమ్మకు, పెద్దకొడుకు జయప్రకాశ్‌రెడ్డికి విబేధాలు వచ్చాయి. తనకు ఆస్తి పంచాలని కొడుకు పట్టుబట్టడంతో పలుమార్లు గొడవపడ్డారు. తల్లి విషయంలో మనస్తాపం చెందిన జయప్రకాశ్‌రెడ్డి తాగుడుకు అలవాటు పడి కళాశాలకు వెళ్లకుండా ఇంటిపట్టునే వుంటున్నాడు. బిడ్డకు ఆస్తి పంచడం ఇష్టం లేని తల్లి కొన్నిరోజులుగా తన పుట్టినిల్లు మదనపల్లి సమీపంలోని జవుకుపల్లిలో వుంటోంది. గొడవను సద్దుమణచడానికి ఆస్తి పంచడానికి బదులు కన్నకొడుకునే చంపించాలని తీర్మానించుకుంది. ఇందుకోసం తనకు బాగా పరిచయం ఉన్న పీటీఎం మండలం నాగన్నకోటకు చెందిన ఆవులకుంట మహేశ్(32)ను పురమాయించింది. తన పెద్దకొడుకును చంపాలని ఎంత ఖర్చు అయినా ఇస్తానని చెప్పింది. రూ.10 లక్షలు ఇవ్వాలని మహేశ్ కోరగా రూ.6లక్షలకు డీల్ కుదుర్చుకుంది. తనకు తెలిసిన 6మంది యువకుల సాయంతో మహేశ్ పథకాన్ని అమలు చేశాడు. ఈ నెల 6న రాత్రి గుడిసివారిపల్లికి వెళ్లి జయప్రకాశ్‌రెడ్డిని తన బొలెరోలో ఎక్కించుకొని గోళ్లపల్లి వద్దనున్న వైన్‌షాపులో మద్యం తీసుకొని తుమ్మణంగుట్ట ఫ్లైఓవర్ వద్దకు తీసుకెళ్లి బాగా తాగించాడు. మళ్లీ అదే వాహనంలో ఎక్కించుకొని బయలుదేరగా ముందస్తు ప్లాన్ ప్రకారం రామానాయునికోటకు చెందిన జి.భానుప్రకాశ్(23), ములకలచెరువుకు చెందిన సాయిగణేశ్(22), సి.ఆకాశ్(22) ఒక ద్విచక్రవాహనంలో, సత్యసాయి జిల్లా తనకల్లు మండలం మార్కూరివారిపల్లికి చెందిన పి.కిరణ్(23), సి.రాహుల్ ప్రమోద్(20), చెండ్రాయునిపల్లికి చెందిన హరిప్రసాద్(19) మరో బండిలో అక్కడికి చేరుకొని బొలెరోను అనుసరించారు. మహేశ్ ఆ వాహనాన్ని గుంతావారిపల్లి వైపు మళ్లించగా కొద్ది దూరం వెళ్లాక, జయప్రకాశ్‌రెడ్డిని కిందకు దింపి వెంట తెచ్చుకున్న బేస్‌బాల్ బ్యాట్‌తో విచక్షణారహితంగా దాడిచేశారు. తీవ్రంగా గాయపరిచి అదే బొలెరోలో పడేశారు. అనంతరం జాతీయరహదారి గుండా వెళ్లి ఎక్కడో ఓచోట పడేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాలని చూశారు. వీలు పడకపోవడంతో తిరిగి గుడిసివారిపల్లి వద్దకు తీసుకొచ్చి వాహనంలోంచి కిందకు లాగి కొన ఊపిరితో ఉన్న జయప్రకాశ్‌రెడ్డి తలపై పెద్ద బండరాయితో మోది చంపేశాడు. ఈ విషయాన్ని తల్లి శ్యామలమ్మకు తెలిపాడు. దీంతో చిన్నకొడుకుతో పాటు అంత్యక్రియలకూ హాజరైంది. రంగంలోకి దిగిన పోలీసులు క్లూస్ టీంతో దర్యాప్తు చేపట్టారు. తల్లి శామలమ్మపైనే అనుమానాలు రావడంతో సాంకేతికత సాయంతో హత్యకేసును ఛేదించారు. సూత్రధారి అయిన కన్నతల్లి శ్యామలమ్మతో పాటు మరో ఆరుగురిని ఇతర చోట్ల అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

హత్యకేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

● రిమాండ్‌కు తరలింపు



నిందితులను అరెస్టు చూపుతున్న వన్‌టౌన్ సీఐ

మదనపల్లె అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడంతో పాటు హత్యకు వాడిన కారును స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు. సోమవారం స్థానిక మదనపల్లె వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. ఆగస్టు 15న మదనపల్లె మండలం సీటీఎం సమీపంలో బ్రిడ్జి వద్ద వ్యక్తి మృతిచెందిన విషయం అప్పట్లో కలకలం రేపింది. కదిరి రైల్వే పోలీసులు అనుమాన్పాద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కాగా పోలీసులు విచారణలో ఇది హత్యగా గుర్తించి ఆ కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు. బసినికొండకు చెందిన పఠాన్ ఆసీఫ్‌ఖాన్ (40), దేవళంవీధికి చెందిన షేక్ మౌలా (33), త్యాగరాజవీధికి చెందిన సయ్యద్ సుల్తాన్(31), దేవళంవీధికి చెందిన టీఏ మహమ్మద్ రబ్బానీ, అప్పారావుతోట, సైదాపేట్‌కు చెందిన షేక్ సాదిక్ (22) అందరూ మంచి స్నేహితులని, అందరికీ మద్యం, గంజాయి తాగడం అలవాటు ఉందని తెలిపారు. ఈ క్రమంలో వీరికి వెస్ట్‌బెంగాల్ నుంచి వచ్చి కురబలకోట మండలం అంగళ్లు వద్ద కూలీ పనులు చేసుకొంటూ జీవిస్తున్న ఎస్‌కే ఖదీర్‌తో పరిచయం ఏర్పడిందని, ఇతను అప్పుడప్పుడూ ఊరి నుంచి వచ్చేటప్పుడు గంజాయి తెచ్చి వీరికి కేజీ రూ.24 వేలకు అమ్మేవాడన్నారు. ఈ విషయం తెలిసిన ఆసీఫ్‌ఖాన్ గంజాయి వారంలోపు తెచ్చి ఇవ్వాలని ఖదీర్‌కు రూ.50వేలు ఇచ్చారు. అయితే నెల రోజులు గడుస్తున్నా తమకు గంజాయి ఇవ్వనందున ఆగస్టు 15న కారులో అంగళ్లు వెళ్లి ఖదీర్‌ను కిడ్నాప్ చేసి కర్ణాటక రాష్ట్రం రాయల్పాడు అడవిలోని నీలగిరి చెట్ల మధ్యకు తీసుకెళ్లి బాగా కొట్టారు. అనంతరం మదనపల్లెలోని ఆసీఫ్‌ఖాన్ ఇంట్లో ఉంచగా అదేరాత్రి ఖదీర్ మృతి చెందాడని గమనించి సుల్తాన్ సూచనల మేరకు ఆసీఫ్‌ఖాన్, షేక్‌మౌలా ఆటోలో మృతదేహాన్ని సీటీఎం రైల్వే రోడ్డుపక్కన పడేసి వెళ్లిపోయారు. అనంతరం కదిరి రైల్వే పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి మదనపల్లె వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం మదనపల్లె డీఎస్పీ మహేంద్ర ఆదేశాల మేరకు వన్‌టౌన్ సీఐ మహమ్మద్ రఫీ, సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐలు అన్సర్‌బాషా, శివకుమార్, టూటౌన్ ఎస్ఐ రహిముల్లా నిందితులను అరెస్టు చేసి కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగా సయ్యద్ సుల్తాన్‌పై గతంలో విజయవాడ, పీలేరు, తిరుపతి, వాయల్పాడు, తదితర పోలీసుస్టేషన్లలో 18 కేసులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ మహమ్మద్‌రఫీ, ఎస్ఐ అన్సర్‌బాషా, పోలీసులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కలికిరి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలో ఉన్న ఒక తోటలో సోమవారం ఉదయం ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతదేహాన్ని సోమవారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల విచారణలో అతను ఇందిరమ్మ కాలనీకి చెందిన ముల్లంగి రమేశ్(55)గా గుర్తించారు. అయితే రమేశ్ మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. అనారోగ్యంతో మరణించాడా లేక పాత కక్షల వల్ల ఎవరైనా ఏమైనా చేశారా అన్న కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి ...



మృతి చెందిన కృష్ణమనాయుడు

చిన్నమండెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అడవి పందులను వేటాడేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ ఉచ్చుకు విద్యుత్ కనెక్షన్ తొలగించే యత్నంలో విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు మండలంలోని చాకిబండలోని వండాడి కొండ సమీపంలో అడవి పందులు పట్టేటందుకు ఆదివారం రాత్రి రాయచోటి మండలం మాధవరం గ్రామం కొండకిందపల్లెకు చెందిన పేయల కృష్ణమనాయుడు (47), పేయల మహేశ్‌నాయుడు, బాబు విద్యుత్ ఉచ్చు ఏర్పాటు చేశారు. సోమవారం తెల్లవారుజామున విద్యుత్ లైన్ తప్పించేందుకు వెళ్లిన కృష్ణమనాయుడు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. దీనిపై సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేస్తున్నారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

రామసముద్రం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రామసముద్రం పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోమేశ్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేశ్‌బాబు తెలిపారు. ఒక గ్రామానికి చెందిన మైనర్ బాలిక కనిపించకుండా పోయిన కేసు విచారణలో భాగంగా ఆ బాలికను నిందితుడు వివాహం పేరుతో ప్రలోభ పెట్టినట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వృద్ధురాలిపై అఘాయిత్యం ?

బి.కొత్తకోట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వృద్ధురాలు(64)పై అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు అఘాయిత్యానికి పాల్పడిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. అతిగా మద్యం తాగిన ఆ యువకుడు వృద్ధురాలి ఇంటిలోనికి ప్రవేశించి ఒంటరిగా వున్న సమయంలో ఆమెపై దాడి చేసి అత్యాచారానికి ఒడిగట్టినట్లు సమాచారం. బాధితురాలిని ప్రభుత్వాసుపత్రికి తరలించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

నిమ్మనపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై నడుచుకొని వెళుతున్న మహిళపై ఓ ఆకతాయి ద్విచక్రవాహనంలో వచ్చి వేధింపులకు గురిచేయంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని వివాహిత తన పొలం వద్దకు నడిచి వెళ్తుండగా అటుగా ద్విచక్రవాహనంపై వస్తున్న షేక్ ఇమ్రాన్ వివాహితను చూసి అసభ్యకరంగా సైగలు చేస్తూ వేధింపులకు గురిచేశాడు. దీంతో ఆమె 112కు ఫిర్యాదు చేయగా షేక్ ఇమ్రాన్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

శివకేశవుల అలంకారంలో అఘోరలింగేశ్వరుడు



వీరభద్రాలయంలో అఘోరలింగేశ్వరుడు

రాయచోటిటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో అఘోరలింగేశ్వరుడు శివకేశవుల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు వివిధ రకాల పుష్పాలు గంధంతో ప్రత్యేకంగా అలంకరించారు. రాయ చోటి పట్టణంతో పాటు చుట్టుప్రక్కల ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో వీర భద్రాలయానికి చేరుకొని శివలింగం, త్రిశూలం ఆకారంలో కార్తీక దీపాలు వెలిగించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి మాఢవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

వర్షంతో పూల రైతు కుదేలు

- తోటల్లో నిలిచిన వర్షపు నీరు
- వ్యాపిస్తున్న తెగుళ్లు.. రైతుల బెంబేలు



మల్లెతోటలో జోరెత్తిన వర్షపునీరు

దువ్వూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫానుతోపాటు వీడకుండా పడిన వర్షాలతో పూలతోటల్లో నీళ్లు నిలబడి తెగుళ్లు సోకాయి. దీంతో పూల చెట్లు కొన్ని కుంచించుకుపోగా, మరికొన్ని కుళ్లిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..

మండలంలోని కానగూడూరు, క్రిష్ణంపల్లెతో పాటు ఐ.బోయనపల్లె, నారాయణపల్లె గ్రామాల్లో పూలతోటలు సాగుచేస్తారు. ఈ ప్రాంతాల్లో పూల సాగుతో కొందరు రైతులు, వాటి విక్రయాలతో మరికొందరు జీవనం సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో సాగు చేసిన మల్లె, సంపంగి, కాగడాలు, కనకాంబరాల తోటలు ఎడతెరిపి లేని వానలతో కుచించుకుపోయాయి. 35 శాతం దిగుబడి కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన ఉద్యానవనశాఖ అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడలేదని రైతులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ సీజన్‌లో కానగూడూరులో ఉన్న పూలమార్కెట్ నిత్యం కళకళలాడేది. ప్రస్తుతం రైతులు పూలు తీసుకురాకపోవడంతో కళావిహీనంగా తయారైంది.



వర్షంతో పూలతోటల్లో కింద వాడిన రెమ్మలు

తోటలు దెబ్బతిన్నాయి



కౌలుకు పొలం తీసుకుని నాలుగున్నర ఎకరంలో మల్లె, జాజితోటలు సాగు చేశా ను. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోయాను. నెల రోజుల నుంచి ఎడతెరిపి లేని వర్షంతో పూల తోటలు దెబ్బతిన్నాయి. అరకొరగా దిగుబడి వచ్చినా కూలీల ఖర్చులు కూడా రావడం లేదు.

- ఎన్.నరసింహులు, కానగూడూరు, పూల రైతు

26న విద్యార్థులతో మాక్ అసెంబ్లీ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈనెల 26న రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో మాక్ అసెంబ్లీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షంషుద్దీన్ తెలిపారు. అమరావతిలో రాష్ట్రస్థాయి కార్యక్రమం జరగనుందన్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి, వారి వివరాలను పాఠశాల విద్యా కమిషనర్, మంగళగిరి, ఆంధ్రప్రదేశ్ కార్యాలయానికి పంపినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థుల్లో ప్రతి నియోజకవర్గం నుంచి ఒకరిని ఉన్నతాధికారులు తుది ఎంపిక చేయనున్నారని వివరించారు. ఈనెల 8వ తేదీ ప్రొద్దుటూరులో జరిగిన కార్యక్రమం ఎంపిక ప్రక్రియకాదని, అది కేవలం విద్యార్థులకు రాజ్యాంగం, సభా విధానం పట్ల అవగాహన కల్పించేందుకు నిర్వహించిన సన్నాహక కార్యక్రమం మాత్రమేనని స్పష్టం చేశారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ అవగాహన పెంపుదలే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా కడప ఎంఈఓ



రఫీక్ అహ్మద్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా కడప ఎంఈఓ హెచ్‌కె రఫీక్ అహ్మద్ ఎంపికయ్యారు. నవంబరు 11న ప్రథమ విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విజయవాడ తుమ్మలపల్లె కళాక్షేత్రంలో రఫీక్ అహ్మద్‌కు బహుమతి ప్రదానం చేయనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి చేతులమీదుగా సన్మానం అందుకోనున్నారు. ఆయనకు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాలు అభినందనలు తెలిపారు.

టీడ్కో ఇళ్లకు దరఖాస్తుల ఆహ్వానం



కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పేదలందరికి ఇళ్లు కల్పించే ఉద్దేశ్యంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) ఏపీ టిడ్కో పరిధిలో కడప నగరం ఎన్టీఆర్ నగర్ ప్రాజెక్టు కింద నిర్మించిన జీ+3ప్లాట్లకు సంబంధించిన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. 18ఏళ్ల పైబడిన వారు 15రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తులు కడప నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో సమర్పించాలన్నారు.

అందుబాటులో ఉన్న ఇళ్ల వివరాలు

జీఓఎంఎస్ నెంబర్ 39 ప్రకారం ఫేజ్-1 (శ్రీలక్ష్మీనగర్), ఫేజ్-2 (చలమారెడ్డిపల్లె) ప్రాంతాల్లోని ఇళ్లకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. 300 చ.అ. పూర్తి ఉచితమని తెలిపారు. 365 చ.అ. రూ.7.55 లక్షలు ఉంటుందని, కేంద్రం రూ.1.50 లక్షలు, రాష్ట్రం రూ.2.65 లక్షలు సబ్సిడీ ఇస్తుందని చెప్పారు. 430 చ.అ. రూ.8.55 లక్షలు ఉంటుందని.. ఇందులో కేంద్రం రూ.1.50 లక్షలు, రాష్ట్రం రూ.2.90 లక్షల సబ్సిడీ లభిస్తుందని చెప్పారు. 365 మరియు 430 చదరపు అడుగుల ఇళ్లకు బ్యాంకు రుణం తీసుకోకుండా స్వీయ చెల్లింపు చేసుకునే వెసులు బాటు కూడా ఉందన్నారు.

అర్హత ప్రమాణాలు

కడప నగరపాలక సంస్థ పరిధిలో లబ్ధిదారుల చిరునామా ఉండాలి. తప్పనిసరిగా మహిళ అయి ఉండాలి. కుటుంబానికి సొంతభూమి/ఇళ్లు ఉండకూడదు. వార్షిక ఆదాయం రూ.3లక్షలకు మించకూడదు. గతంలో కేంద్ర లేదా రాష్ట్ర హౌసింగ్ స్కీం లబ్ధి పొందకూడదు. సంవత్సరానికి సగటు విద్యుత్ వినియోగం 300 యూనిట్లకు లోపుగా ఉండాలి. కుటుంబంలో నాలుగు చక్రాల వాహనం ఉండకూడదు. కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి/పించన్‌దారుడు/ఔట్‌సోర్సింగ్/కాంట్రాక్ట్ ఉద్యోగి ఉండకూడదు.

దరఖాస్తుకు కావాల్సినపత్రాలు

లబ్ధిదారులు జీవిత భాగస్వామి/తండ్రి/తల్లి ఆధార్ కార్డులు, కుటుంబ రేషన్‌కార్డు, లబ్ధిదారు ఓటరుకార్డు.

ఫ్లాట్ కేటాయింపు విధానం

మొదట 365, 430 చదరపు అడుగుల ఇళ్లకు లబ్ధిదారుల వాటా చెల్లించిన వారికి ప్లాట్లు కేటాయిస్తారు. తదుపరి 300 చదరపు అడుగుల ఉచిత ఇళ్లకు కేటాయింపు జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు కడప నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో సంప్రదించాలని కోరారు.

బ్రౌన్ జయంతి రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించడం హర్షణీయం

- వైవీయూ వీసీ బెల్లంకొండ రాజశేఖర్



ప్రసంగిస్తున్న వైవీయూ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్

కడప కల్చరల్, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): తెలుగుభాషా సాహిత్యానికి ఎనలేని సేవ చేసిన సీపీ బ్రౌన్ జయంతిని రాష్ట్ర ఉత్సవంగా కూటమి ప్రభుత్వం నిర్వహించడం హర్షణీయమని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ పేర్కొన్నారు. తెలుగు సూర్యుడు సీపీ బ్రౌన్ 227వ జయంతిని పురష్కరించుకుని బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్రంలో సోమవారం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఉపకులపతి తొలుత రాజీవ్‌మార్గ్‌లోని బ్రౌన్ విగ్రహానికి, సమావేశ మందిరంలో గల చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుభాషా సాహిత్యానికి శాశ్వత వెలుగు నిచ్చిన మహనీయుడు బ్రౌన్ అన్నారు. సుమారు 15 మంది పండితులను పోషించి కడప గడపలో ఆయన సాహిత్య యజ్ఞాన్ని నిర్వహించారన్నారు. బ్రౌన్ నివశించిన బంగళా శిథిలాలను డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి స్థలదాత సంపత్‌కుమార్, జి.కృష్ణమూర్తి, జేసీ సుబ్బయ్య, ఎస్సీ రామసుబ్బారెడ్డి, కట్టా నరసింహులు లాంటి ప్రముఖులతో కలిసి బ్రౌన్‌స్మారక గ్రంథాలయమనే జ్ఞానసౌధాన్ని నిర్మించారన్నారు. వైవీయూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ మాట్లాడుతూ తెలుగు భాషా సాహిత్యం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన త్యాగమూర్తి బ్రౌన్ అని కొనియాడారు. బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, హైదరాబాద్ విశ్వవిద్యాలయం విశ్రాంత తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య రామనరసింహం మాట్లాడుతూ ఆంగ్లేయుడైన బ్రౌన్ తెలుగుపై పట్టు సాధించి నిఘంటువుల నిర్మాణం చేస్తే తెలుగువారమైన మనం మాతృభాషను నిర్లక్ష్యం చేస్తూ ఆంగ్లంపై మక్కువ పెంచుకోవడం అవివేకమన్నారు. కార్యక్రమంలో బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు చింతకుంట శివారెడ్డి, భూతపురి గోపాల కృష్ణశాస్త్రి, తెలుగు శాఖ ఆచార్యులు ఎస్.ఈశ్వర్‌రెడ్డి, ఎంఎం వినోదిని, పి.రమాదేవి, పుత్తా పుల్లారెడ్డి, పుత్తా బాలిరెడ్డి, విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, జానమద్ది విజయభాస్కర్, బ్రౌన్ గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల సుస్థిరాభివృద్ధే లక్ష్యం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సరళ

చెన్నూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సుస్థిరాభివృద్ధి లక్ష్యంగా ప్రతి గ్రామ పంచాయతీలో పచ్చదనం పరిశుభ్రతకు ప్రాధాన్యత నివ్వాలని సచివాలయాల సిబ్బంది శిక్షణ ప్రత్యేకాధికారి, కాలహస్తి ఎంపీడీవో సరళ అన్నారు. స్థానిక ఎంపీడీవో సభాభవనంలో జిల్లా పరిషత్ ముఖ్య ప్రణాళికాధికారి ఓబులమ్మ అధ్యక్షతన జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల పంచాయతీ కార్యదర్శులు, ఇతర స్థాయి అధికారులకు రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సరళ మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యుపీసీలను గ్రామ పంచాయతీలు ఆదాయ వనరులుగా మార్చు కోవాలన్నారు. ప్రతి పంచాయతీలో పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని, తద్వారా గ్రామాల్లో ఆరోగ్యకర వాతావరణం నెలకొంటుందన్నారు. ముఖ్యంగా ఎస్‌డబ్ల్యుపీసీలు కేవలం చెత్త సంపద కేంద్రాలుగా కాకుండా అందులో పలు రకాల మొక్కలను పెంచి ఆహ్లాదకర వాతావ రణం నింపి ఆరోగ్య సంపద కేంద్రాలు తీర్చి దిద్దుకోవాల న్నారు. ఇందుకు పంచాయతీ కార్యదర్శులు కృషి చేయా లన్నారు. ఈ శిక్షణలో డివిజనల్‌స్థాయి అధికారులు వారి పరి ధిలో ఉన్న సచివాలయాల సిబ్బందికి శిక్షణ విషయాలు వివరించి గ్రామ పంచాయతీల అబివృద్ధికి చేయాలన్నారు.

కార్యక్రమంలో జమ్మలమడుగు డీఎల్‌డీవో రామాంజనేయులు, జిల్లా సమన్వయ అధికారి రమణారెడ్డి, డీఎల్‌పీవోలు నూర్జహాన్, విజయభాస్కర్, ఎంపీడీవో కిరణ్ మోహన్‌రావు, డీపీఆర్‌సీ, ఆర్పీలు, ఎఫ్‌టీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నమ్మి వచ్చిన ఆదివాసీలకు చిత్రహింసలు

- ఏజెన్సీ నుంచి 15 మందికి విముక్తి
- స్వస్థలాలకు పంపిన బీజేపీ నేతలు



గిరిజనులను రైలుకు పంపిస్తున్న బీజేపీ నాయకులు

కడప మారుతీనగర్, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): ఊరు కానీ ఊరులో చేపలు పట్టేందుకు నమ్మి వచ్చిన ఆదివాసీ గిరిజన తెగకు చెందిన 15 మందికి తిండి తిప్పలు పెట్టకుండా తీవ్ర హింసకు గురిచేస్తున్న ఓ ఏజెన్సీ బారి నుంచి బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు శివానాయక్‌లు కాపాడి సురక్షితంగా వారి స్వస్థలానికి పంపించారు. సోమవారం కడప రైల్వేస్టేషన్‌లో వారు మాట్లాడుతూ ఓ ఏజెన్సీకి చెందిన కొందరు పెద్ద మనుషుల ముసుగులో ఆంధ్ర-ఒరిస్సా బోర్డర్‌లో గల 15 మంది ఆదివాసీ గిరిజన తెగకు చెందిన వారిని రప్పించి ఒంటిమిట్ట మండలం కోడుమూరు సమీపంలో గల నది ఒడ్డున గల అటవీ ప్రాంతంలో వుంచి తినడానికి తిండి పెట్టకుండా ఇబ్బందులకు గురిచేశార న్నారు. ఈ విషయం గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రాజారావు దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఆయన తమ దృష్టికి తీసుకురాగా ఒంటిమిట్ట సీఐ బాబుకు తెలిపామన్నారు. ఆయన తక్షణమే స్పందించి వారిని అటవీ ప్రాంతం నుంచి బయటకు రప్పించారన్నారు. వారికి అండగా నిలిచి భోజనం, మంచినీరు అందజేసి వారిని విశాఖపట్నం రైలుకు పంపించామని తెలిపారు.

పారిశుధ్యం లోపిస్తే చర్యలు



మురికి కాల్వను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

ముద్దనూరు నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య లోపం కన్పించకూడదని జిల్లాపరిషత్ సీఈవో ఓబులమ్మ హెచ్చరించారు. మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీలో సోమవారం సీఈవో పర్యటించారు. అందులో భాగంగా ఎస్సీ కాలనీ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న మురికినీటి కాల్వను పరిశీలించారు. కాల్వలో దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ చల్లాలని ఆదేశించారు. అలాగే ఇంటింటి చెత్తసేకరణపై క్లాప్ మిత్రల ద్వారా ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాల వద్ద మురికి నీరు నిల్వ ఉండకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో రాధాకృష్ణవేణికి ఆదేశాలు జారీ చేశారు. డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రుడు, కార్యదర్శి సౌభాగ్యలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజాన్ని చైతన్యం చేసే చిత్రాలు గీయాలి

- వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని చైతన్యం చేసే చిత్రాలు మీ కుంచెల నుంచి జాలువారాలని, సృజనాత్మక ఆలోచనలకు కలాఖండాలు రూపొంది ఆకాశమే హద్దుగా ముందుకు సాగాలని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ ఫైన్‌ఆర్ట్స్ విద్యార్థులకు ఉద్బోధించారు. సోమవారం యోగివేమన విశ్వవిద్యాలయం లలితకళా విభాగంలో వారం రోజుల ఇంక్ ఏ పేరుతో ప్రింట్ మేకింగ్ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రికెట్‌లో శ్రీచరణిని దేశమంతా ఎలా గుర్తుంచుకుందో అలా మీ రంగంలో మీరు తయారు కావాలని ఆకాంక్షించారు. సమాజానికి ఉపయుక్తమయ్యే, సమాజాన్ని సంస్కరించే పెయింటింగ్స్ మీ నుంచి ఆశిస్తున్నామన్నారు. చిత్ర కళాకారులు అంతర్ముఖులుగా ఉంటారని ప్రస్తుత యుగంలో అలా ఉంటే రాణించలేమన్నారు. ప్రతి చిత్రకారుడు తన బ్రాండ్‌ను బిల్డ్ చేసుకున్నప్పుడే పెయింటర్‌గా ఆర్థిక వనరులతో పాటు ఖ్యాతిని ఆర్జించవచ్చన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ కంకణాల గంగయ్య, వర్క్‌షాప్ కన్వీనర్ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు పలుసూచనలు తెలియజేశారు. అనంతరం వైస్ చాన్సలర్ బోర్డుపై పెయింటింగ్ వేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. తెలంగాణ, తెలుగు విశ్వవిద్యాలయం ఆచార్యులు ఎం.కృష్ణారెడ్డి, ప్రముఖ ప్రింట్ మేకింగ్ నిపుణులు చలపాక అప్పలాచారి విద్యార్థులకు శిక్షణ నైపుణ్యాలను ఇచ్చారు. కార్యక్రమంలో ఫైన్ ఆర్ట్స్ శాఖ అధ్యాపకులు సీహెచ్ వెంకటేష్, బి.చిన్నరాయుడు, బి.ఈరప్ప, ఎం.వాసవి, ఎస్.చంటి, డాక్టర్ కె.రెడ్డిశేఖర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సోలార్ కంపెనీలో కేబుల్‌వైరు చోరీ

కొండాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.కోడూరు వద్ద ఉన్న సోలార్ కంపెనీలో కేబుల్‌వైరు చోరీకి గురయింది. కంపెనీలో ఆదివారం రాత్రి సుమారు 9000 మీటర్ల కేబుల్ వైరు చోరీకి గురయినట్లు కంపెనీ ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేబుల్ విలువ సుమారు రూ.3,90,000 ఉంటుందని వారు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ శివనాగిరెడ్డి తెలిపారు.

భూతగాదా విషయమై ఇరువర్గాల ఘర్షణ

నిమ్మనపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భూతగాదా విషయంపై జరిగిన ఘర్షణలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. బండ్లపై పంచాయతీకి చెందిన మేకల లక్ష్మన్న, భార్య లక్ష్మమ్మ తమ పొలంలో పనుల చేసుకుంటుండగా అదే గ్రామానికి చెందిన వారి దాయాదులు మేకల రెడ్డెప్ప, భార్య వనజ ఆ భూమిలో తమకు కూడా భాగం వుందని వారిపై దాడి చేసి గాయపరిచారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి



పెద్దదర్గా ఉరుసు సందర్భంగా ఆదివారం అర్ధరాత్రి ఊరేగింపులో పీఠాధిపతి


ఊరేగింపులో పాల్గొన్న ముస్లింలు

'వైవీయూలో అవకతవకలు జరగలేదు'

కడప ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలో వేతన చెల్లింపుల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని వచ్చిన వార్తలు నిజం కావని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పుత్తా పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. బిల్లులను అప్‌లోడ్ చేసే క్రమంలో జరిగిన సాంకేతిక తప్పిదమే ఈ అపార్థాలకు కారణం అన్నారు. సాంకేతిక తప్పిదాన్ని గుర్తించిన వెంటనే సవరించి పంపడం జరిగిందన్నారు. ఉద్యోగులందరికీ సకాలంలో వేతనాలు అందాయన్నారు.

కూటమి పాలనపై విషం చిమ్మడం మానుకోండి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసరెడ్డి



కడప మారుతీనగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 16 నెలలుగా సాగుతున్న కూటమి పాలనపై వైసీపీకి చెందిన కొంతమంది నాయకుల ముసుగులో విషం చిమ్మడం మానుకోవాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసరెడ్డి సూచించారు. సోమవారం స్థానిక ద్వారకానగర్‌లోని టీడీపీ కార్యాలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ పాలనలో వారు చేసిన లిక్కర్, ఇసుక మాఫియా, అంతా ఇంతా కాదనే సంగతి అందరికీ తెలిసిన సంగతే అన్నారు. రాష్ట్రంలో కూటమి సర్కార్ అధికారం చేపట్టినప్పటి నుంచి అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా వున్నారన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలంతా రాష్ట్రానికి క్యూ కడుతుండడంతో సహించలేక అవాకులు చెవాకులు పేలడం విడ్డూరంగా వుందన్నారు. గత వైసీపీ పాలనలో పోలవరం పనులు ఆగిపోగా వాటిని తిరిగి చేపట్టి రానున్న 2027 చివరికంతా పూర్తి చేసేందుకు కూటమి సర్కార్ కృతనిశ్చయంతో వుందన్నారు. పోలవరం పూర్తి అయితే రాష్ట్రం సస్యశ్యామలం కాబడుతుందన్నారు. రాష్ట్రానికి గూగుల్ సంస్థ రావడం ఆషామాషి కాదన్నారు. దాదాపు 1.30 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు యాగీ తగ్గించుకుంటే మంచిదన్నారు.

షాదీఖానా నిర్మాణానికి సహకరించండి


మంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న పార్థసారథిరెడ్డి

వేముల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేముల మండలంలో షాదీఖానా నిర్మాణానికి సహకరించాలని బీసీ సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితను సోమవారం విజయవాడలో ఉన్న మంత్రిని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి కలిసి సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నియోజవకర్గంలో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వేములలో షాదీఖానా నిర్మాణం ముస్లిం ల చిరకాల ఆకాంక్ష అన్నారు. అలాగే వేములలోని క్రిస్టియన్‌లకు ప్రత్యేక కాలనీ ఏర్పాటుచేయాలని కోరారు. ఇందుకు మంత్రి సవిత సానుకూలంగా స్పందించినట్లు పార్థసారథిరెడ్డి తెలిపారు.

హైలెవెల్ బ్రిడ్జి పనులు ప్రారంభం


స్లాబ్ పనులను ప్రారంభిస్తున్న మారెడ్డి జోగిరెడ్డి

చక్రాయపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో పాపాఘ్ని నదిపై గండి కొవ్వూరు-వెన్నపల్లె మధ్య దాదాపు రూ.29కోట్లతో నిర్మిస్తున్న హైలెవెల్ బ్రిడ్జి పనుల స్లాబ్ పనులను టీటీహెచ్ఎల్సీ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి ప్రారంభించారు. గత తొమ్మిది నెలల క్రితం ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ పోట్లదుర్తి సురేష్‌నాయుడు దాదాపు రూ.29కోట్లతో పనులు దక్కించుకొని పనులను వేగవంతంగా చేసి స్లాబ్ వరకు తెప్పించారు.జనవరి చివరికల్లా పనులు పూర్తిచేసి బ్రిడ్జిని అందుబాటులోకి తెస్తామని కాంట్రాక్టర్ తెలిపారు.కార్యక్రమంలో డీఈ సుధాకర్ రెడ్డి,శంకర్‌రెడ్డి,యోగీశ్వర్‌రెడ్డి,ప్రసాద్‌రెడ్డి,రవీంద్రరెడ్డి,కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆంధ్రప్రదేశ్ లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టరుగా లోమడ చంద్రమోహన్‌రెడ్డి నియమితులైన సందర్భంగా కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆర్.మాధవి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న దృశ్యం

హరహర మహాదేవ శంభో శంకర

వైభవంగా కార్తీక మూడో సోమవారం ● పలుచోట్ల అన్నదానం ● దీపకాంతులతో వెలిగిన శివాలయాలు

చెన్నూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరులోని నాగేశ్వర సమేత లలితాంబికాదేవి గ్రామోత్సవం నయనాం దకరంగా జరిగింది. కార్తీక మాసం మూడోసోమవారం సందర్భంగా స్థానిక మల్లేశ్వరాలయంలో ఉత్సవ మూర్తులకు మంత్రోచ్చారణల మధ్య కళ్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవాన్ని నయన మనోహరంగా నిర్వహించారు. ఆలయం నుంచి మసీదు పక్కవీధి గుండా చెన్నూరు పురవీధుల్లో మధ్యాహ్నం 3 నుంచి మొదలుపెట్టి రాత్రి వరకు ఊరేగింపు నిర్వహించారు.

పటిష్టమైన బందోబస్తు..: ఊరేగింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గతంలో జరిగిన పరిస్థితులు దృష్టిలో ఉంచుకుని అడిషనల్ ఎస్పీ ప్రకాశ్‌బాబు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు.

మల్లేశ్వరునికి మహాభిషేకం..: స్థానిక మల్లేశ్వరాలయంలో మూలవిరాట్ మూర్తికి పెద్దఎత్తున రుద్రాభిషేకాలు జరిగాయి.

అన్నప్రసాద వితరణ..: స్థానిక దాత గలిజల సాంబరాజు ఆధ్వర్యంలో నాగేశ్వరాలయం వద్ద పెద్దఎత్తున అన్న ప్రసాద వితరణ గావించారు.

భక్తిమయం గంగాహారతి..: స్థానిక మల్లేశ్వరాలయం వద్ద సోమవారం రాత్రి గంగా హారతి నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని దీపాలు వెలిగించారు.



చెన్నూరులో నాగేశ్వరుని ఊరేగింపు, వేంపల్లెలో పూజలందుకుంటున్న దుర్గాదేవి, గవిమల్లేశ్వరుడు

భక్తుల కొంగుబంగారం పొలతల మల్లికార్జునుడు

పెండ్లిమర్రి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పొలతలలో మూడో కార్తీక సోమవారం సందర్భం గా స్వామి, అమ్మవార్లు, అక్కదేవతలను దర్శించుకున్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డికి ఆలయ చైర్మన్ శిరిగిరెడ్డి రాజారెడ్డి,ఈఓ కృష్ణానాయక్ ఆలయ స్వాగతం పలికారు. అనంతరం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించి కల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం దేవస్థానం చుట్టూ స్వామి,అమ్మవార్లను ఊరేగింపు నిర్వహించారు.

వల్లూరు..: కార్తీక మూడో సోమవారం సందర్భంగా శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేసి అనంతరం స్వామివారికి దర్శించుకుని కాయ కర్పూరాలు సమర్పించారు. పుష్పగిరి క్షేత్రంలో శ్రీ కామాక్షి సమేత వైద్యనాథేశ్వర రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవ ఆలయంలో భక్తులు తరలివచ్చి నదిలో స్నానాలు ఆచరించి తదనంతరం ఆ దేవదేవుడు శివకేశవులను దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. భవానీ శివాలయంలో ఉదయాన్నే అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని చందనాలంకారంలో అలంకరించారు. అలాగే వల్లూరులో గోటూరు ఆంజనేయస్వామి శివాలయాల్లో భక్తులకు అన్న ప్రసాదకార్యక్రమాలను నిర్వహించారు. ఎస్ఐ పెద్ద ఓబన్న దేవదాయ సిబ్బందితో కలిసి భద్రతా ఏర్పాట్లు చేశారు.

వీరపునాయునిపల్లె..: మండల పరిధిలోని అనిమెల గ్రామ సమీపంలో ఉన్న సంగమేశ్వర ఆలయంలో సంగమేశ్వరుడు, పార్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కాగా మండల పరిధిలోని సర్వరాయ సాగర్ డ్యామ్ వద్ద ఉన్న మునీశ్వర ఆలయం,ఉరుటూరు గ్రామంలో ప్రత్యేకంగా పూజలు చేశారు.అనంతరం తీర్థ ప్రసాదాలను అందుకున్నారు.

వేంపల్లె..: వేంపల్లెలో కార్తీకమాసం మూడవ సోమవారం పురస్కరించుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గవిమల్లేశ్వరాలయంలో దుర్గాదేవి మల్లేశ్వర స్వామికి అభిషేక పూజలు నిర్వహించారు.ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయపూజారి ప్రసాదరావు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. పాతపేటలోని భవానీనీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.




పొలతలలో అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, వీఎన్‌పల్లె...అన్నదానంలో భక్తులు, వల్లూరు... పుష్పగిరి కొండపై దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సదస్సును జయప్రదం చేయండి

కడపనాగరాజుపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కడపలో నవంబరు 30న భవన నిర్మాణ కార్మికుల రాయలసీమ, నెల్లూరు జిల్లాల సదస్సు జయప్రదం చేయండి అని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం రాష్ట్రడిప్యూటీ సెక్రటరీ ఉద్దె మద్దిలేటి,జిల్లా ప్రధాన కార్యదర్శి లింగన్న, జిల్లా అధ్యక్షుడు బి.రామాంజనేయులు భవన నిర్మాణ కార్మికులకు పిలుపునిచ్చారు. కడపలోని చిలకలబావి వద్దఉన్న ఏఐటీయూసీ ఆఫీస్‌లో సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు.

విద్యార్థిని మృతి


ఆందోళన చేస్తున్న విద్యార్థిని బంధువులు

సీకేదిన్నె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కల్లూరు జశ్వంతి (15) అనే విద్యార్థిని సోమవారం మృతి చెందింది. విద్యార్థిని మొదట కిందపడినట్లు తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు ప్రైవేటు ఆస్పత్రికి తరలించాలని తెలుపగా పాఠశాల యాజమాన్యం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. అయితే అప్పటికే మృతి చెందడంతో వారు చేర్పుకోలేదని హుటాహుటిన కడప రిమ్స్‌కు బాలిక బంధువులు సమక్షంలో తరలించగా రిమ్స్‌లో కూడా మృతి చెందినట్లు నిర్ధారించడంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కాగా విద్యార్థిని మృతదేహాన్ని పాఠశాల వద్దకు తీసుకెళ్లి న్యాయం చేయాలని మార్చురీలోని స్ట్రెక్చర్‌పై తీసుకుని బయల్దేరారు. పోలీసులు నచ్చజెప్పడంతో వారు శాంతించారు. డీఈవో షంషుద్దీన్ పాఠశాలకు చేరుకుని విచారించారు. కాగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ బాలమద్దిలేటి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐలు రెడ్డెప్ప, ఓబులేసు, రామక్రిష్ణారెడ్డి, ఎస్ఐలు శ్రీనివాసులరెడ్డి, రాజరాజేశ్వర్‌రెడ్డి, హుస్సేన్, చింతకొమ్మదిన్నె తహసీల్దారు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అడవులను కాపాడడం మన ధర్మం

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అడవులను కాపాడడం కేవలం మన విధి మాత్రమే కాదు.. అది సేవా ధర్మం కూడా అని జిల్లా అటవీ అధికారి వినీత్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర అటవీ అమరవీరుల దినోత్సవం పురస్కరించుకుని స్థానిక జిల్లా అటవీ కార్యాలయంలో సోమవారం అటవీ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఫారెస్టు డీఎఫ్‌వో, స్క్వాడ్ డీఎఫ్‌వో, సబ్ డీఎఫ్‌వో రేంజర్ డిప్యూటీ రేంజరు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు అందించాలి

కడప మారుతీనగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇటీవల వచ్చిన మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా నష్టపోయిన ప్రతీ చేనేత కుటుంబానికి బియ్యంతో పాటుగా ఇతర నిత్యావసర వస్తువులను అందించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేనేత దినోత్సవం సందర్భంగా చంద్రబాబు నేతన్నలకు ప్రకటించిన 25వేల రూపాయల ఆర్థిక సాయం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన ధర్నా కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో చేనేత కార్మికసంఘం జిల్లా సమితి అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధానకార్యదర్శి వరప్రసాద్, నాయకులు పి. సంతోష్, సి. భరత్ సమితి నాయకులు పాల్గొన్నారు.

తెలుగు భాషోద్ధారకుడు సీపీ బ్రౌన్ : తులసిరెడ్డి

వేంపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీపీ బ్రౌన్ దొర తెలుగు భాషోద్ధారకుడని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్యఅధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. సీపీ బ్రౌన్ జయంతిని వేంపల్లెలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'మోసగిస్తున్న ప్రభుత్వం'

కమలాపురం రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలను మోసగిస్తూ పేద ప్రజలకు ఉచిత వైద్యాన్ని దూరం చేసేందుకు కంకణం కట్టుకుందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి, సాయినాథశర్మ అన్నారు. కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని బస్టాండు ఆవరణంలో సోమవారం రచ్చబండ కార్యక్రమం, కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. వైసీపీ నేతలు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్



పులివెందుల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయ నిధి అని వేంపల్లె మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

మంజూరైన బీసీ రుణాలకు సబ్సిడీ విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట మాట్లాడుతున్న ఓబులేసుయాదవ్

కడప మారుతీనగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి):మంజూరైన బీసీ రుణాలకు సబ్సిడీ విడుదల చేయాలని బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ లో డీఆర్ఓను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున, నాయకులు పీ.వీ. రమణ, సంగటి మనోహర్, ప్రతాప్‌రెడ్డి, కైపు రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారికి పోస్టింగ్ ఆర్డర్లు విడుదల చేయాలి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జోన్-4 పరిధిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న నాన్-టీచింగ్ సిబ్బంది ప్రమోషన్లకు సంబంధించి అర్హులైన వారందరికి పోస్టింగ్ ఆర్డర్లు విడుదల చేయాలని రాష్ట్ర ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ సర్వీస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షప్రధాన కార్యదర్శులు అవ్వారు శ్రీనివాసులు, బీసీహెచ్ సుధాకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కర్నూలు, కడప, అనంతపురం,చిత్తూరు పాత జిల్లాల అసోసియేషన్ అధ్యక్షులు కూడా ఆర్జేడీఐకి లేఖలు సమర్పించి, అర్హులైన వారందరికీ పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వాలని కోరిన విషయాన్ని గుర్తుచేశారు.

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : సీఐటీయూ

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పదిహేను సంవత్సరాలుగా రిమ్స్‌లో పనిచేస్తున్న శానిటేషన్ సూపర్‌వైజర్స్‌ను అకారణంగా తొలగించడం అన్యాయమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మనోహర్ తెలిపారు. ఈ విషయమై జిల్లా జాయింట్ కలెక్టర్‌కు సీఐటీయూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు మనోహర్, శ్రీనివాసులరెడ్డి, ఆప్కాస్ రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఆప్కాస్ జిల్లా అధ్యక్షుడు పవన్, శానిటేషన్ సూపర్‌వైజర్లు వినతిపత్రం అందించారు.

రోడ్డుభద్రతా నియమాలు పాటించాలి

కడప క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలు పాటించాలని ట్రాఫిక్ సీఐ డీకే జావీద్ సూచించారు. సోమవారం నగరంలోని ఎస్పీ బంగ్లా సర్కిల్ వద్ద రహదారి భద్రతా నియమాలు పాటించాలని సూచిస్తూ సైన్‌బోర్డులు, బారికేడ్లను ట్రాఫిక్ సీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ మైనర్ డ్రైవింగ్ ప్రమాదాలకు సంకేతమని, తల్లిదండ్రులు ఎవరూ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. ద్విచక్ర వహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు.



బారికేడ్లను ఏర్పాటు చేస్తున్న ట్రాఫిక్ సీఐ జావీద్

దారి ఏర్పాటుకు గంగిరెద్దుకు వినతిపత్రం : సీపీఎం

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా అధికార యంత్రాంగం ప్రజా సమస్యల పరిష్కార వేదిక పేరుతో కాలయాపన చేస్తున్నారు తప్ప నిజంగా సమస్యలు పరిష్కరించడం లేదని సీపీఎం కడపనగర కార్యదర్శి రామమోహన్ తీవ్రంగా విమర్శించారు. ఎనిమిది నెలలుగా చెర్లోపల్లె లేఅవుట్‌లో రహదారి సమస్యను పరిష్కారం చేయాలని అనేక రూపాల్లో అధికారులకు వినతిపత్రాలు ఇచ్చిన ఇప్పటి వరకు స్పందించలేదన్నారు. దీన్ని నిరసిస్తూ సోమవారం కడపనగరంలోని బాలాజీ నగర్‌లో గంగిరెద్దుకు వినతిపత్రం సమర్పించి వినూత్నరీతిలో నిరసనవ్యక్తం చేశారు.

ఎన్ఎస్ఎస్ వారోత్సవంలో లయోలా వలంటీర్లు

పులివెందుల టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పులివెందుల లయోలా డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ జోజిరెడ్డి,వైస్ ప్రిన్సిపాల్ చిన్నప్ప ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ వీక్ క్యాంప్‌ను ఏర్పాటుచేశారు. పట్టణ పరిసర గ్రామాలైన చిన్నకుడాల ప్రాంతాలలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తడి,పొడి చెత్తలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు కళ్యాణిరెడ్డి, వెలవలి సుధీర్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల కడుపు కొట్టొద్దు

కడప సెవెన్ రోడ్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో సెంట్రల్ కిచెన్ నిర్వహణతో మధ్యాహ్న భోజన కార్మికులకు ఉపాధి అవకాశాలను దెబ్బతీయొద్దని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి అన్నారు. ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్.చాంద్‌బాషా, సులోచన,కామాక్షమ్మ, మేరీ, శంకర్, లక్ష్మీదేవి,సుబ్బయ్య, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

నమః శివాయ.. రుద్రాయ

● కార్తీక మూడో సోమవారం శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు ● వేకువజాము నుంచే శివుడికి అభిషేకపూజలు, అర్చనలు
● ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించిన మహిళా భక్తులు ● నిర్వాహకులు, దాతలచే భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానాలు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహాశివునికి ప్రీతికరమైన కార్తీక మాసం మూడవ సోమవారం సందర్భంగా శివాలయాలు నమఃశివాయచ..రుద్రాయచ... అంటూ భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. స్వామివారి దర్శనం కోసం వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని పరమేశ్వరుడికి అభిషేకాలతోపాటు ప్రత్యేకపూజలు చేసి భక్తిశ్రద్ధలతో మొక్కుకున్నారు. రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీరాముడు ప్రతిష్ఠించిన సైకత లింగానికి ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి దేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో అగస్త్య మహాముని ప్రతిష్ఠించిన శివలింగానికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి దేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి పూలమాలలతో అలంకరించారు. అమృతేశ్వరస్వామి ఆలయంలో మరకత లింగం, నవరత్న లింగం, జలలింగం, ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తిపీఠాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం, సాయంత్రం మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని కార్తీక దీపాలు వెలిగించి చల్లంగా చూడమని స్వామివారిని వేడుకున్నారు.

జమ్మలమడుగులో: జమ్మలమడుగు మండలంలోని శివాలయాల్లో భక్తులు కార్తీక మూడవ సోమవారం పురష్కరించుకుని ప్రముఖ శైవక్షేత్రమైన కన్నెతీర్థంలో బాలత్రిపుర సుందరీదేవి, సుందరేశ్వరస్వామి ఆలయాల్లో సోమవారం భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. మహిళలు దీపాలు వెలిగించి మొక్కుకున్నారు. అలాగే ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం ఏర్పాట్లు చేశారు. అలాగే మండలంలోని కన్నెలూరు శివాలయంలో మోరగుడి, ఎస్.ఉప్పలపాడు, దేవగుడి గ్రామాల్లో భక్తులు పూజలు చేసి మొక్కుకున్నారు.

కొండాపురంలో: మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మూడో కార్తీక సోమవారం కావడంతో శైవక్షేత్రాల్లో వేకువజాము నుంచే భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని బాలప్పకోన, మల్లేశ్వరకోన, దొంతికోన తదితర చోట్లకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అదేవిధంగా కొండాపురం, గండ్లూరు, సుగుమంచిపల్లె శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలప్ప కోన, మల్లేశ్వరకోన చోట్ల అన్నదానం నిర్వహించారు.

దువ్వూరులో: దువ్వూరులో కార్తీక సోమవారం సందర్భంగా శివాలయాల్లో సందడి కనపడుతోంది. చీకటిలో నుంచి భక్తులు స్వామి దర్శనం కోసం తహతహలాడారు. మండల పరిధిలోని పలు ఆలయాల్లో భోజనాలు ఏర్పాటు చేశారు. కోలాటం నిర్వహించారు. మహిళలు దేవాలయాల్లో పూజలు చేసి తరించారు.

కాశినాయనలో: కార్తీక మాసంలోని మూడో సోమవారం భక్తులు చెన్నవరం ,అక్కెంగుండ్ల, వరికుంట్ల, నర్సాపురం, జ్యోతీ క్షేత్రం గ్రామాల్లోని శివాలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నర్సాపురం శివాలయ ప్రాంగణంలో అయ్యప్ప భక్తులు గ్రామస్థుల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పడి పూజ నిర్వహించారు. అనంతరం స్వాములకు అన్నదానం చేశారు.

చాపాడులో: మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి ఆలయంలో మూడో కార్తీక సోమవారం భక్తులు భక్తిశ్రద్ధలతో వీరభద్రస్వామిని, శివున్ని, భద్రకాళి అమ్మవారిని పూలతో, కుంకుమతో ప్రత్యేకంగా పూజించి అలంకరించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కూడా దైవదర్శనం చేసుకున్నారు. వీరభద్రస్వామిని, అమ్మవారిని ఊరేగింపు జరిపారు. ఆ దేవస్థానం ఛైర్మన్ పెరుగు వీరనారాయణ, ఈవో శంకరబాలాజీ భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. మహిళలు ప్రమిదలు వెలిగించి పూజలు చేశారు. భక్తులకు అలంఖాన్‌పల్లె కుమ్మరకొట్టాలు గ్రామాలకు చెందిన వీరశేఖర్, కందుకూరి వీరన్నలు విశ్వబ్రాహ్మణ అన్నసత్రంలోనూ, సర్వమత అన్నదాన సత్రంలోనూ, ఇంకాపలువురు అన్నదానం చేశారు.


జమ్మలమడుగులో సుందరేశ్వరస్వామి

మైదుకూరు రూరల్‌లో : కార్తీకమూడవ సోమవారం శైవక్షేత్రాలు భక్తుల తో కిటకిలాడాయి. మైదుకూరులో లక్ష్మీమాధవరాయస్వామి తిరుమలనాధస్వామి,వనిపెంట చెన్నకేశవస్వామి, ముక్కొండ మల్లేశ్వరుడు, భైరవకోనలోని మొండి భైరవుడు తదితర ఆలయాలలో భక్తులు వేకువ జామునుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు.

రాజుపాలెంలో: కార్తీక మాసం మూడో సోమవారం శివాలయాలు భక్తులతో మారుమోగాయి. సాయంత్రం 5గంటలకు మహిళలు పెద్ద సంఖ్యలో శివాలయాలకు వెళ్లి స్వామివారిని దర్శించుకుని దీపాలు వెలిగించారు. టంగుటూరులోని సోమేశ్వరాలయం, వెల్లాలోని భీమలింగేశ్వరస్వామి ఆలయం, రాజుపాలెం మడమడక వద్దన ఉన్న శివాలయాల్లో భక్తులకు భారీగా అన్నదానం చేశారు.



రాజుపాలెంలో ప్రత్యేక అలంకరణలో పరమేశ్వరుడు

ఖాజీపేటలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


చాపాడులో అన్నదానం

బ్లాక్ స్పాట్లను గుర్తించాలి

మైదుకూరు నవంబరు10 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మండల పరిధిలోని 67వ నెంబరు జాతీయ రహదారి పై పదేపదే జరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా బ్లాక్ స్పాట్లను గుర్తించి సూచికలను ఏర్పాటు చేయాలని బీజేపీ మాజీ కేంద్ర కార్యవర్గ సభ్యు డు బీపీ ప్రతాపరెడ్డి కోరారు. ప్రజలను ప్రమాదాల నుంచి రక్షించాలని ఆయన కోరారు.

అభివృద్ధికి పాటుపడదాం

ప్రొద్దుటూరు అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణాభివృద్ధికి పాటుపడుదామని ప్రొద్దుటూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఇర్ఫాన్‌బాష ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన విలేకరుల లో మాట్లాడుతూ చిన్నపాటి వర్షాలు పడినా గాంధీరోడ్డు, మైదుకూరు రోడ్డు, చెరువులను తలపిస్తుండడం బాధాకరమన్నారు.

అగస్త్యేశ్వరస్వామి కోనలో కార్తీక పూజలు


అగస్త్యేశ్వరస్వామి కోనలో భక్తుల సందడి

మైలవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడవ సోమవారం పురష్కరించుకుని మండలంలోని శివాలయాలు శివనామస్మరణతో మారుమ్రోగాయి. మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అగస్త్యేశ్వరస్వామి కోన, త్రిమూర్తుల కోన, పలు గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అగస్త్యేశ్వరస్వామి కోనకు జమ్మలమడుగు ఆర్టీసీ వారు భక్తుల సౌకర్యార్థం కోసం ప్రత్యేక సర్వీసులను నడిపారు. పలు శివాలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ఆలయాలను మూడవ కార్తీక సోమవారం పురష్కరించుకుని ప్రత్యేకంగా అలంకరించారు.

విద్యార్థుల భవిష్యత్‌కు కృషి చేయాలి

బ్రహ్మంగారిమఠం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్‌కు కృషి చేయాలని ఎంపీడీవో రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం బి.మఠం మండలంలోని కొత్తబస్వాపురం ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి అడిగి తెలుసుకున్నాడు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ మురళీమోహన్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి గొడుగుల ఉత్సవం


గొడుగుల మహోత్సవానికి హాజరైన టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని మోరగుడి గ్రామంలో ఈనెల 8వ తేదీ నుంచి చౌడేశ్వరీదేవి జ్యోతుల మహోత్సవం ప్రారంభమై 10వ తేదీ గొడుగుల ఉత్సవంతో ముగిసింది. ఈ సందర్భంగా సమీప గ్రామాల నుంచి భక్తులు చౌడేశ్వరీదేవి అమ్మవారికి పూజలు చేసి మొక్కుకున్నారు. సోమవారం రాత్రి జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి మోరగుడి గ్రామంలో శ్రీ చౌడేశ్వరీదేవి అమ్మవారి గొడుగుల ఉత్సవంలో పాల్గొన్నారు. అమ్మవారికి పూజలు చేసి ఆయన మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): 69వ రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో ముగ్గురు ప్రొద్దుటూరు విద్యార్థులు పతకాలు సాధించి ప్రతిభ కనపరిచారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో ఒంగోలులోని నెస్ట్‌జెన్ ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూలులో రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్-14 బాలుర విభాగంలో డి.కౌసిక్ వెండి పతకం, అండర్-17బాలికల విభాగంలో ఎం.జాగృతి వెండి పతకం, సి.వీరవినిత్ కాంశ్య పతకం సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులు డిసెంబరులో ఇండోర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని కోచ్ రాఘవ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను కోచ్, జార్జ్‌కారోనేషన్ క్లబ్ అధ్యక్షుడు బాలగంగిరెడ్డి, కార్యదర్శి మార్తల సుధాకర్‌రెడ్డిలు అభినందించారు.

వరికుంట్ల రహదారిలో ముళ్ల కంప తొలగింపు

కాశినాయన నవంబరు10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళాపురం నుంచి వరికుంట్ల వరకు ఉన్న ప్రదాన రహదారి ముళ్ల కంపను సోమవారం ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. మిద్దెల,గొంటువారిపల్లె,బాలాయపల్లె తదితర గ్రామాల సమీపంలో ముళ్ళ కంప రోడ్డుపైకి ఇరువైపుల చొచ్చుకొని వచ్చి వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా.ఈవిషయంపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ఈ రోడ్డు సొగసు చూడతరమా అంటూ ప్రత్యేక కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు సోమవారం నుంచి యంత్రాల సాయంతో రోడ్డుకు ఇరువైపుల ఉన్న కంప చెట్లను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీంతో రోడ్డు విశాలంగా కన్పించడంతో ప్రయాణికులు,వాహన దారులు హర్షం వ్యక్తంచేస్తున్నరు.

ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్‌గా వెంకటసుబ్బయ్య ఎన్నిక



బద్వేలు, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): బద్వేలు మండలానికి చెందిన ఎన్. వెంకటసుబ్బయ్య ఎస్టీయూ విభాగ రాష్ట్ర కౌన్సిలర్‌గా నియమితులయ్యారు. అలాగే జిల్లా కార్యదర్శులుగా విజయభాస్కర్‌రెడ్డి, రామసుబ్బయ్యలను ఎన్నుకున్నట్లు తెలిపారు. వేంపల్లె మండలంలో సోమవారం నిర్వహించిన ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికల్లో ఈ ఎన్నిక జరిగిందని తెలిపారు. ఎస్టీయూ ఉపాధ్యాయుల హక్కుల సాధనలో ముందుండే సంఘం సమస్యల పరిష్కారం పదోన్నతులు , బదిలీలు వేతన భత్యాల సమస్యలపై నిరంతరం కృషిచేస్తామని తెలియజేశారు. రాష్ట్ర కమిటి కన్వీనర్ చింతంరెడ్డి రామచంద్రారెడ్డి, మండల శాఖ అధ్యక్షులు వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోండి

పోరుమామిళ్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) :గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఏబీవీపీ నాయకుడు అభిలాష్ అన్నారు. సోమవారం పోరుమామిళ్లలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఒక పాఠశాలపై ఎంఈవోకు ఫిర్యాదు చేశామన్నారు. కానీ ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి

బ్రహ్మంగారిమఠం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎరువుల కొరత లేకుండా చూడాలని సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు శివకుమార్ కోరారు. బ్రహ్మంగారిమఠం మండలకేంద్రంలోని సుందరయ్యభవన్‌లో సీపీఎం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎక్కువగా బడుగు బలహీన వర్గాల భూములు కబ్జా చేస్తున్నారని దీనికి వ్యతరేకంగా గ్రామీణ, ధనిక, పెత్తందారీ వర్గాల దుర్మార్గులను ప్రతిఘటిస్తూ గ్రామ గ్రామాన ప్రతిఘటన పోరాటం ప్రారంభంకావాలన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా అంగన్వాడీ, రేషన్ డీలర్లను మారుస్తున్నారని అది అప్రజాస్వామికమన్నారు.

గ్రామాల అభివృద్ధే ఎమ్మెల్యే లక్ష్యం

బ్రహ్మంగారిమఠం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగా రిమఠం మండలంలోని పలు గ్రామాల అభివృద్దే మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ధ్యేయమని మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బా రెడ్డి పేర్కొన్నారు. ఎంపీడీవో రామచంద్రారెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో రూ.18లక్షల వ్యయంతో సీసీ రోడ్డును వారు ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ నేత శివా , జనసేన వార్డుమెంబరు రాజేష్, ప్రజలు పాల్గొన్నారు.

సగర కార్పొరేషన్ డైరెక్టర్‌గా చంద్రశేఖర్

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు పేటా చంద్రశేఖర్‌ను ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ సగర, ఉప్పర వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించింది. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి,టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి వినతి మేరకు సీఎం చంద్రబాబు ఆయనను డైరెక్టర్‌గా నియమించారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, యువనేత కొండారెడ్డి, సీఎం చంద్రబాబు మంత్రి లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రూపరాంపేటలో గిరిప్రదక్షిణ


గిరిప్రదక్షిణ చేస్తున్న రితేష్‌రెడ్డి

బద్వేలుటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు పట్టణంలోని రూపరాంపేటలో శివశైవక్షేత్రంలో కార్తీక మూడో సోమవారం పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణ నిర్వహించారు. శివానందస్వామివారి ఆలయ ప్రాంగణం చుట్టూ బద్వేలు పట్టణంలో మొట్టమొదటిసారిగా గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బద్వేలు నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డి, ఏపీఐసీసీడైరెక్టర్ వద్దిబోయిన ప్రసాద్‌రెడ్డి, ఆలయ అధ్యక్షులు పాటూరి శివరామిరెడ్డి వేదపండితులు పూజా కార్యక్రమాల అనంతరం ప్రారంభించారు. గిరిప్రదర్శన సందర్భంగా మంగళవాయిద్యాలు, వివిధ రకాల పూలతో అలంకరించిన వాహనములో శివపార్వతుల విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రదక్షిణ చేపట్టారు. ఈ కార్యక్రమం వెంబడరి సాంస్కృతిక కార్యక్రమాలు, కులుకు భజనలతో గిరిప్రదర్శన కార్యక్రమాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయకమిటీ అధ్యక్షుడు పాటూరు శివరామిరెడ్డి కమిటీ సభ్యుల పర్యవేక్షణలో స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండాప్రత్యేక ఏర్పాట్లను నిర్వహించారు. ఎన్‌సీసీ విద్యార్థుల సహకారంతో క్యూలైన్ల యందు భక్తులకు తొక్కిసలాట జరగకుండా ప్రత్యేక కార్యచరణ చేపట్టారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు పోట్లదుర్తి విద్యార్థులు



ఎర్రగుంట్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు పోట్లదుర్తి విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం శివరాం, పీడీలు లక్ష్మి, సుధాకర్‌రెడ్డిలు తెలిపారు. ధరణి, అనుపమ, వైష్ణవి (9వ తరగతి), సునంద (10వ తరగతి), నందకుమార్, అమరనాథ్(8వ తరగతి), వెంకటసూర్య(9వ తరగతి)లు ఎంపికైనట్లు తెలిపారు. 8వ తేదీన కడప ఉర్దూ పాఠశాలలో జరిగిన ఎంపికల్లో పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ఈనెల 21, 22, 23 తేదీల్లో అనకాపల్లిలో జరిగే పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిత్యం వహిస్తారన్నారు. ఎంపికైన విద్యార్థులను, పీడీలను హెచ్‌ఎం, ఉపాధ్యాయుల బృందం అభినందించారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై అక్రమ సస్పెన్షన్లను ఎత్తివేయండి

బద్వేలు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న డ్రైవరు సుబ్బిరెడ్డి అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలంటూ ఎన్ఎంయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆమేరకు ఎన్ఎంయూ ఆధ్వర్యంలో డిపో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో సెక్రటరీ చంద్రయ్య మాట్లాడుతూ అక్రమంగా సస్పెండ్ చేసిన డ్రైవరు సుబ్బిరెడ్డిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని స్త్రీశక్తిపథకం ద్వారా ఇబ్బందులు పడుతున్న డ్రైవరు, కండక్టర్లను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్యారేజీ కార్యదర్శి నాగేంద్ర, శ్రీధర్, మల్లిఖార్జున, కేఎస్ రాయుడు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలకు టీడీపీ శ్రేణులను సంసిద్ధం చేయాలి


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

బద్వేలుటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు నియోజకవర్గ పరిధిలో రానున్న పంచాయతీ, మండల జడ్పీటీసీ ఎన్నికలకు టీడీపీ శ్రేణులను సన్నద్ధం చేయాలని మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం బద్వేలు నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గ పరిధిలో రానున్న సంస్థాగత ఎన్నికలకు ఏ ఒక్కస్థానాన్ని వదలుకోకుండా టీడీపీ నాయకులు, కార్యకర్తలు సముష్టికృషితో టీడీపీ జెండాను ఎగురవేసేలా చూడాలని పిలుపునిచ్చారు. అదే విధంగా నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలకు సంబంధించిన టీడీపీ మండల అధ్యక్షులను సత్వరమే నియమించాలని బద్వేలు నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డికి సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలి


పాత్రికేయులతో మాట్లాడుతున్న డీఎస్పీ

బ్రహ్మంగారిమఠం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు ప్రజలతో మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. బ్రహ్మంగారిమఠం పోలీసుస్టేషన్‌ను సోమవారం మైదుకూరు డీఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్‌లోని రికార్డులను ఎఫ్ఐఆర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ప్రతి పోలీసుస్టేషన్ తనిఖీ చేయాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మైదుకూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టరు శివశంకరయాదవ్, బి.మఠం ఎస్ఐ శివప్రసాద్; హెడ్‌కానిస్టేబుల్ వెంకన్న, కానిస్టేబుళ్లు, రైటర్ రమణ, ఓబులయ్యతో పాటు సిబ్బంది ఉన్నారు.

శ్రీచరణికి అభినందనలు వెల్లువ


శ్రీచరణిని సన్మానిస్తున్న నాగమణి దంపతులు

ఎర్రగుంట్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మహిళల క్రికెట్ కప్ సాధించడంలో మేటి ప్రతిభ కనపరచిన తెలుగుతేజం శ్రీచరణికి స్థానికంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్టీపీపీ అధికారులు, బంధువులు, ఉద్యోగులు ఇంటికి వెళ్లి కలిసి శాలువకప్పి సన్మానించి అభినందిస్తున్నారు. సోమవారం ఆర్టీపీపీ మాజీ ఎంపీటీసీ ఎన్.నాగమణి, రమణయ్య దంపతులు కలిసి శాలువకప్పి అభినందించారు. అలాగే యూనియన్ నాయకులు, ఆర్టీపీపీ ఎస్ఈలు తదితరులు ఆమెను అభినందించారు. అయితే ఎవరినీ కలవనీయకుండా భద్రతను ఏర్పాటు చేశారు.

పచ్చదనం.. పరిశుభ్రతపై శిక్షణా కార్యక్రమాలు

జమ్మలమడుగు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొరిగెనూరు గ్రామంలో ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్‌లో పచ్చదనం.. పరిశుభ్రతపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సైదున్నీసా తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జమ్మలమడుగులోని గొరిగెనూరులో మండలస్థాయిలో ఈ కార్యక్రమాలు ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమానికి మండలస్థాయిలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, ఉపసర్పంచులు, గ్రీన్ అంబాసిడర్స్, గ్రీన్‌గార్డ్స్, వీఏవోలు, ఎస్‌హెచ్‌జీ మెంబర్లు, హాజరుకావాల్సి ఉందన్నారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని ఎంపీడీవో తెలిపారు.

స్కిల్ పోటీలకు అంబేడ్కర్ గురుకుల విద్యార్థులు


రాష్ట్రస్థాయి స్కిల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు మెమెంటోలు అందించిన దృశ్యం

గోపవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి స్కిల్ పోటీలకు అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. సోమవారం గోపవరం మండలం గురుకుల విద్యార్థులు జయశ్రీ, నిఖిత, లిమలు ఐటీ /ఐటీ ఈఎస్ ఒకేషనల్ (ట్రేడ్ విభాగంతో అద్భుత ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి స్కిల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ భానుమతి తెలిపారు. ఈసందర్భంగా వారికి మెమెంటోలు, సర్టిఫికెట్లు అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి స్కిల్ పోటీలు ఈ నెల 14న విజయవాడలో జరుగుతాయన్నారు.